
కార్పెంటర్స్ కాలనీకి ఏర్పాటు చేసిన స్వాగత ఆర్చి

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య జిల్లా వార్తలు
5
శనివారం 8 జూన్ 2024


కార్పెంటర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన శిలాఫలకం

నమ్మించి.. ముంచేశారు

- పీలేరులో అట్టహాసంగా కార్పెంటర్స్ కాలనీ ఏర్పాటు
- అనుమతులు లేవంటూ నిర్మాణాలు నిలిపివేత
- ఆందోళన, అయోమయంలో కార్పెంటర్లు
- వైసీపీ నేతల తీరుపై ఛీత్కారాలు


కార్పెంటర్స్ కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణం

పీలేరు, జూన్ 7: వైసీపీ అధికారం కోల్పోగానే ఆ పార్టీ నేతల పాపాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. గడిచిన ఐదేళ్లలో పీలేరు ప్రాంతంలో వైసీపీ నాయకులు వ్యవహరించిన అహంకారపూరిత, నిర్లక్ష్య ధోరణులకు పీలేరు ఏపీఐఐసీ లే-ఔట్‌లోని కార్పెంటర్స్ కాలనీ సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. అధికారం శాశ్వతం అన్న అహం భావంతో నిబంధనలకు తూట్లు పొడుస్తూ అడ్డగోలుగా వ్యవహరించిన వైసీపీ నాయకుల తప్పిదాలకు పీలేరులోని కార్పెంటర్లు మూల్యం చెల్లించాల్సి వస్తోంది. అధికారంలో ఉన్న వారి మాటలు నమ్మి లక్షలాది రూపాయలు వెచ్చించి భూమి చదును చేసుకుని, ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన వారికి కాలనీ ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతులు లేవంటూ రెవెన్యూ అధికారులు తేల్చి చెప్పడంతో ఏం చేయాలో పాలుపోని దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. సాయం ముసుగులో వైసీపీ నాయకులు చేసిన మోసానికి తాము బలయ్యామని, తమను మోసగించిన పాపం వారిదే నని కార్పెంటర్లు శాపనార్థాలు పెడుతున్నారు. ఒకటి కాదు రెండు కాదు, ఏకంగా రూ.50 లక్షలు వెచ్చించి చదును చేసుకున్న భూమి, అందులో రూ.లక్ష దాకా ఖర్చు చేసి వేసుకున్న పునాదులు తమకు కాకుండా పోతాయేమోనని వారు ఆందోళన చెందుతున్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ఏపీఐఐసీ లే-ఔట్‌లో కార్పెంటర్స్ కాలనీ ఏర్పాటు

పీలేరు పట్టణంలోని సుమారు 300 మంది కార్పెంటర్ల కోసం స్థానిక వైసీపీ నాయకులు గత ఏడాది డిసెంబరులో ఏపీఐఐసీ లే-ఔట్‌లో కార్పెంటర్స్ కాలనీ పేరుతో కాలనీ ఏర్పాటు చేశారు. వేపులబైలు పంచాయతీ పరిధిలోని సర్వే నెం.26/1లో 6 ఎకరాలు ఉన్న గుట్టను కాలనీ కోసం కేటాయించామని, గుట్టను చదును చేసుకుంటే అందులో ప్రభుత్వ పరంగా ఇళ్లు మంజూరు చేయించి ఇస్తామని హామీ ఇచ్చారు. వారి మాటలు నమ్మిన కార్పెంటర్లు సుమారు రూ.50 లక్షలు దాకా చందాల రూపంలో సేకరించి గుట్టను సుమారు రెండు నెలల పాటు రాత్రింబవళ్లు శ్రమించి చదును చేసుకున్నారు. చదును పనులు పూర్తయిన తరువాత ఈ ఏడాది ఫిబ్రవరి 29వ తేదీ అప్పటి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చేతుల మీదుగా కాలనీకి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వ పరంగా అందరికీ పట్టాలు, హౌసింగ్‌శాఖ తరపున సకాలంలో బిల్లులు అందేలా చూస్తామని ప్రకటించారు. ఆ తర్వాత స్థానిక నేతలు అటువైపు కన్నెత్తి చూడలేదు. కార్పెంటర్ అసోసియేషన్ నేతలు పలుమార్లు వారిని సంప్రదించినా ఎటువంటి ఇబ్బంది ఉండబోదని, మళ్లీ తామే అధికారంలోకి వస్తామని, ధైర్యంగా ఇళ్ల నిర్మాణ పనులు చేసుకోవాలని వారికి భరోసా కల్పించారు. దీంతో అప్పటి నుంచి కొంత మంది కార్పెంటర్లు వైసీపీ నాయకులపై నమ్మకంతో కాలనీలో చిన్నచిన్నగా తమ ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో కార్పెంటర్ల నెత్తిన గురువారం పిడుగు లాంటి వార్త పడింది. కార్పెంటర్స్ కాలనీ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేవని, ఉన్నతాధికారుల నుంచి తదుపరి ఆదేశాలు వచ్చే వరకు నిర్మాణాలు నిలిపివేయాలని రెవెన్యూ అధికారులు వారికి స్పష్టం చేశారు. దీంతో కార్పెంటర్లు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. గతంలో అధికారంలో ఉన్న వారు చూపించిన ప్రదేశంలోనే తాము నిర్మాణాలు చేసుకుంటున్నామని, అనుమతులు లేకుండా తమ ద్వారా అంతంత ఖర్చు ఎలా పెట్టించారని, ఒక రకంగా తమను వైసీపీ నాయ కులు నమ్మించి గొంతు కోశారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆది నుంచీ వివాదాస్పదంగా కార్పెంటర్స్ వ్యవహారం

కార్పెంటర్స్ కాలనీ వ్యవహారం ఆది నుంచి వివాదాస్పదంగా కొనసాగు తోంది. చేతివృత్తుల వారమైన తమకు అందరికీ కలిపి ఒకేచోట కాలనీ ఏర్పాటు చేయించాలని చాలా కాలంగా పీలేరులోని సుమారు 300 మంది కార్పెంటర్స్ రాజకీయ పార్టీలను డిమాండ్ చేస్తున్నారు. ఆ క్రమంలో వారికి తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక కాలనీ నిర్మించి ఇస్తామని 2019 ఎన్నికల సందర్భంగా వైసీపీ నాయకులు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత జగనన్న కాలనీల పేరిట ఏర్పాటు చేస్తున్న కాలనీల్లోనే అందరికీ ఇళ్లు ఇస్తామని, ప్రత్యేక కాలనీలు ఏర్పాటు చేయలేమంటూ తొలుత నిస్సహాయత వ్యక్తం చేశారు. అవే మాటలు వల్లెవేస్తూ కాలయాపన చేస్తూ వచ్చారు. అయితే మళ్లీ 2024 ఎన్నికల సమయంలో ఇబ్బంది వస్తుందేమోనన్న భయంతో స్థానిక వైసీపీ నాయకులు గత ఏడాది జూన్‌లో కార్పెంటర్లకు ప్రత్యేక కాలనీ ఏర్పాటు కోసం పీలేరు-తిరుపతి మార్గంలో ఎర్రగుంటపల్లె పంచాయతీ పరిధిలోని సర్వే నెం.573లో ఉన్న వాగు పోరంబోకు స్థలాన్ని చూపించారు. ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే అక్కడ ఇళ్లు కట్టుకొమ్మని పురమాయించారు. ఈ విషయంపై అప్పట్లో (22.6.2023) ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం కూడా వెలువడింది. దీంతో కళ్లు తెరిచిన రెవెన్యూ అధికారులు కార్పెంటర్లు చేపట్టిన చదును పనులను అడ్డుకున్నారు. అయితే కార్పెంటర్లకు ఎటువంటి ఇబ్బంది కలిగించవద్దని వైసీపీ నాయకులు అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. వాగు పోరంబోకు స్థలాల్లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని పలు కేసుల్లో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పులు వెలువరించిందని, ఆ తీర్పులను ఉల్లంఘిస్తే తీవ్రమైన చర్యలు తప్పవని వారు అప్పట్లో ఎంపీ, ఎమ్మెల్యేకు సైతం స్పష్టం చేశారు. దీంతో వారు మరోచోట స్థలం చూపిస్తామని కార్పెంటర్లను బుజ్జగించారు. వారి మాటలను గౌరవించి కార్పెంటర్లు అక్కడి నుంచి తప్పుకున్నారు.

అప్పటి నుంచి వారిని పలుమార్లు తమ చుట్టూ తిప్పుకుని చివరకు ఏపీఐఐసీ లే-ఔట్ పరిధిలోని వేపులబైలు పంచాయతీ సర్వే నెం.26/1లోని 6 ఎకరాల గుట్టను చూపించారు. ఏపీఐఐసీ పరిధిలోని ఆ గుట్టను పారిశ్రామికేతర అవసరాలకు వినియోగించుకోవాలంటే ఏపీఐఐసీ, ప్రభుత్వ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అవన్నీ తీసుకోకుండానే ఆర్భాటంగా ఈ ఏడాది ఫిబ్రవరి 29న కార్పెంటర్స్ కాలనీకి అప్పటి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి శంఖుస్థాన చేశారు. అనుమతులు సంగతి వారు చూసుకుంటారులే అనుకుని కార్పెంటర్లు సుమారు రూ.50 లక్షలు చందాలు వేసుకుని గుట్టను చదును చేసుకుని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. ఇంత కాలం సార్వత్రిక ఎన్నికల పనుల్లో బిజీగా ఉన్న అధికా రులు గురువారం కార్పెంటర్స్ కాలనీపై దృష్టి సారించారు. ఏపీఐఐసీ అధికారుల ఫిర్యాదు మేరకు తహసీల్దారు మహబూబ్ బాషా తన సిబ్బందితో కలిసి గురువారం సాయంత్రం కార్పెంటర్స్ కాలనీని సందర్శించారు. అవన్నీ అక్రమ నిర్మాణాలుగా పరిగణిస్తామని, ఉన్నతా ధికారుల ఆదేశాలు వచ్చే వరకు ఎటువంటి నిర్మాణాలు కొనసాగించకూడదని అక్కడున్న వారికి హెచ్చరికలు జారీ చేశారు. దీంతో కార్పెంటర్స్ కాలనీ వ్యవహారం మళ్లీ మొదటి కొచ్చినట్లు అయ్యింది.

సమగ్ర విచారణ జరుపుతాం

• తహసీల్దారు మహబూబ్ బాషా

కార్పెంటర్స్ కాలనీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరుపుతాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్కడ నిర్మాణాలు నిలిపివేశాం. రికార్డుల ప్రకారం కార్పెంటర్లు ఇళ్లు నిర్మించు కుంటున్న స్థలం ఇప్పటికీ ఏపీఐఐసీ పరిధిలోనే ఉంది. ఏపీఐఐసీ భూముల్లో ఇళ్లు నిర్మించు కోవాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి.

త్రిశంకు స్వర్గంలో కార్పెంటర్లు

అరాకొర సంపాదనతో అంతంత మాత్రం బతుకులు బతుకుతున్న తమకు నిలువ నీడ కల్పించమని అర్థిస్తే వైసీపీ నాయకులు ఆది నుంచి మోసం చేశారని పలువురు కార్పెంటర్లు వాపోయారు. తొలుత తిరుపతి రోడ్డులో, ఇప్పుడు ఏపీఐఐసీ లే-ఔట్‌లో తమను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి మాటలు నమ్మి తాము గుట్ట చదును కోసం సుమారు రూ.50 లక్షలు వెచ్చించామని, ఆ తరువాత ఇళ్ల నిర్మాణాల కోసం ఒక్కొక్కరు సుమారు రూ.లక్ష దాకా ఖర్చు పెట్టామని తెలిపారు. ఇప్పుడు అధికారులు వచ్చి అవన్నీ అక్రమ నిర్మాణాలు కిందకు వస్తాయని అంటున్నారని, ఏం చేయాలో పాలుపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సొంత నిధులు ఖర్చు పెట్టినప్పటికీ తాము భూఆక్రమణదారులుగా సమాజంలో దోషులుగా తలదించుకోవాల్సి వస్తోందని వారు మదనపడుతున్నారు.

సమగ్ర విచారణ జరిపించండి

• టీడీపీ నాయకులు

కార్పెంటర్స్ కాలనీపై సమగ్ర విచారణ జరిపించాలని పీలేరు మండల టీడీపీ అధ్యక్షుడు వారణాశి శ్రీకాంత్ రెడ్డి తహసీల్దారు మహబూబ్ బాషాను కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కార్పెంటర్స్ ముసుగులో ఎంతో విలువైన ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు కాజేసే ప్రయత్నం చేస్తున్నారని, వాటిని అడ్డుకో వాలని ఆయన డిమాండ్ చేశారు.

వైసీపీ ఓటమితో... మూగబోయిన జడ్పీటీసీలు

- ఉత్సవ విగ్రహాల్లా కమిటీల చైర్మన్‌లు
- సమస్యలను పట్టించుకోని వైనం
- చుట్టం చూపునకే పరిమితం
- పేలవంగా జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

సాధారణ ఎన్నికల ఫలితాలలో అటు రాష్ట్రంలోను, ఇటు మాజీ సీఎం జగన్ జిల్లాలోను వైసీపీ ఘోర పరాజయాన్ని చవిచూసింది. రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. జూన్ 4న ఫలితాలు వెలువడిన నాటి నుంచి వైసీపీ క్యాడర్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు నిద్రపట్టని రోజులను గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జడ్పీ సమావేశహాలులో నిర్వహించిన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో వైసీపీ జడ్పీటీసీ సభ్యుల గొంతు పూర్తిగా మూగబోయింది. 50 మంది జడ్పీటీసీలు ఉండగా కేవలం 20 మందిలోపే హాజరయ్యారు. వీరిలో కూడా కేవలం పోరుమామిళ్ల జడ్పీటీసీ ముత్యాల చెన్నయ్య మాత్రమే పసలేని మూడు నాలుగు సమస్యలపై పెదవి విప్పారు. మిగిలిన వారంతా చుట్టం చూపునకే పరిమితమయ్యారు. ఏడు సంఘాల పరిధిలోని వివిధ శాఖలపై కేవలం 40 నిమిషాలు మాత్రమే ఆయా అధికారులతో మొక్కుబడిగా సమీక్ష నిర్వహించారు.


మాట్లాడుతున్న జడ్పీ వైస్‌చైర్మన్ బాలయ్య

కడప(రూరల్) జూన్ 7: జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం శుక్రవారం ఉదయం 10-30 నిమిషాలకు ప్రారంభించారు. ఆయా కమిటీల చైర్మన్‌లు సమావేశ వేదికపై అధికారులు వినిపిస్తున్న ప్రగతి నివేదికలను వింటూ ఉత్సవ విగ్రహాల్లాగా ఉండిపోయారు. ఇదివరకు జడ్పీ చైర్మన్ హోదాలో ఆకేపాటి అమరనాథరెడ్డి అధ్యక్షతన ప్రణాళిక మరియు ఆర్థికస్థాయి, గ్రామీణాభివృద్ధి, నిర్మాణపు పనులు, విద్య మరియు వైద్యసేవల స్థాయి సంఘం సమావేశాలు నిర్వహించేవారు. ఆయన ఇటీవల ఎమ్మెల్యేగా గెలుపొందిన కారణంగా శుక్రవారం నాటి స్టాండింగ్ కమిటీ సమావేశానికి హాజరుకాకపోవడంతో చైర్మన్ నేతృత్వంలోని పై నాలుగు కమిటీలను కలుపుకుని వ్యవసాయశాఖ కమిటీ చైర్మన్ బాలయ్య (వైస్ చైర్మన్-2), మహిళా సంక్షేమం స్థాయి సంఘం అధ్యక్షురాలు జె.శారద (వైస్ చైర్‌పర్సన్-1), సాంఘిక సంక్షేమ స్థాయి సంఘం చైర్‌పర్సన్ సి.పుష్పలతలు కలిసి సమష్టిగా నిర్వహించినప్పటికీ.. ఏ ఒక్కరు సమావేశాలను సజావుగా జరిపించలేదు.

పేలవంగా జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని పేలవంగా నిర్వహించారు. ఉదయం 10-40 గంటలకు ప్రారంభించి 11-20 నిమిషాలకు మమ.. అనిపించారు. సమావేశాల్లో ఆయా శాఖలకు సంబంధించిన అంశాలపై అర్థవంతమైన చర్చలేకుండా సాగించి ప్రజాప్రతినిధులు, అధికారులు ఇలా వచ్చి అలా వెళ్లారు. సమావేశ ప్రారంభం నుంచి ఒక్కొక్కశాఖకు 7 నిమిషాల వ్యవధికూడా కేటాయించకుండా పరుగో.. పరుగు అన్నట్లుగా సాగించారు. మొత్తంగా ఉన్న 7 స్టాండింగ్ కమిటీ సమావేశాలను ఒకేచోట ఒకదాని తరువాత ఒకటి టకటకా నిర్వహించి ఓ పనైపోయిందని చేతులు దులిపేసుకున్నారు.

ప్రశ్నలేదు.. సమాధానం లేదు..!

ఇప్పటి వరకు నిర్వహించిన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలలో ఏనాడూ ఆయా శాఖల పనితీరుపై పూర్తిగా అర్థవంతమైన చర్చ కొనసాగించలేదు. ఆ పరంపరను శుక్రవారం కూడా కొనసాగించారు. ఆయా కమిటీల చైర్మన్ల నుంచి కానీ సభ్యుల నుంచి కానీ ప్రశ్నలు లేకపోవడంతో అధికారులు కూడా సమాధానాలు చెప్పాల్సిన అవసరం లేకుండా సరిపుచ్చారు. సమావేశాల పేరుతో ఖర్చులు మాత్రం తడిపి మోపెడవుతున్నాయి.

బాధ్యతను మరిచిన ప్రజాప్రతినిధులు

శుక్రవారం నిర్వహించిన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ప్రజా సమస్యలను పట్టించుకోలేదు. ప్రస్తుతం 2024 ఖరీఫ్ ప్రారంభమైంది. నైరుతి రుతుపవనాలు కాస్త ముందుగానే ప్రవేశించి వర్షాలు ఆశాజనకంగా పడుతున్నాయి. అయినప్పటికి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను నిన్నటి వరకు (జూన్ 4 వరకు) అధికారం ఉన్న వైసీపీ ప్రభుత్వం అందించలేదు. దీంతో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పారిశుధ్య పనులు సక్రమంగా కొనసాగడంలేదు. గ్రామీణ మంచినీటి సరఫరా పథకం నత్తనడకన సాగుతోంది. మట్టిమాఫియా, ఇసుక మాఫియా రాజ్యమేలుతుండడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయి. వ[...]ంలో వారం రోజుల్లో విద్యాలయాలు ప్రారంభం కాబోతున్నాయి. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుకాలు, మౌలిక వసతుల కొరత పరిపాటిగా వస్తోంది. వీటన్నింటిపై పూర్తి స్థాయిలో చర్చించి పరిష్కారం చూపాల్సిన గురుతర బాధ్యతను ప్రజాప్రతినిధులు మరిచిపోయి సమావేశాన్ని తూతూ మంత్రంగా నిర్వహించారు.

అధికారులే బహుబాగు

శుక్రవారం నిర్వహించిన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి కడప, అన్నమయ్య జిల్లాల ఆయాశాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఆయా కమిటీల పరిధిలోని శాఖల అధికారులు వారి పరిధిలోని సమాచారాన్ని, సంక్షేమాన్ని, పథకాలను, అభివృద్ధిని వెల్లడించారు. ఏవైనా సందేహాలు ఉంటే సమాధానాలు వినిపిస్తామని చెప్పారు. కానీ ప్రజాప్రతినిధులు ఎవ్వరూ నోరు మెదపలేదు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో రమణారెడ్డి, కడప, అన్నమయ్య జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

చైర్మన్ చాంబర్‌లో వైసీపీ ఓటమిపై చర్చ

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని వైసీపీ జడ్పీటీసీ సభ్యులంతా త్వరత్వరగా ముగించుకుని చైర్మన్ చాంబర్‌కు చేరుకున్నారు. అక్కడ మహిళా జడ్పీటీసీల బంధువులు, కొందరు వైసీపీ నాయకులతో కలిసి ఇటీవల వెలువడిన సార్వత్రిక ఫలితాలలో వైసీపీ ఓటమిపై చర్చించుకున్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను గానీ, కింది స్థాయి నాయకులను, కార్యకర్తలను పట్టించుకోకపోవడం వలనే ఓటమికి కారణాలుగా చెప్పుకొచ్చారు. సమస్యలను ఎంత చెప్పినా వినిపించుకోలేదని.. బటన్లు నొక్కితే సరిపోదని ఇప్పుడు చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏమి ప్రయోజనమని మాట్లాడుకున్నారు. వైసీపీ ప్రభుత్వ పెద్దల స్వయం కృతాపరాధమే ఓటమికి కారణమని నిట్టూర్చారు. కాగా.. ఒత్తిడి తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేయించారని వాటికి నిధులు ఇవ్వకుండానే వైసీపీ ప్రభుత్వం దిగిపోయి తమను సర్వనాశనం చేసిందని పనులు చేపట్టిన కొందరు ఆవేదన, ఆక్రోశం వ్యక్తం చేశారు. తాము రూ.3 కోట్లకు పనులు చేశామని ఇప్పుడు బిల్లులు రాకుంటే ఏ బాయిలో దూకాలో తెలీడం లేదని కొందరు ఆవేదన వ్యక్తం చేశారు.

జడ్పీ చైర్మన్ పదవికి రాజీనామా చేశా

కడప (రూరల్), జూన్ 7: ఉమ్మడి కడప జిల్లాలోని రాజంపేట శాసన సభ్యునిగా తాను ఎన్నిక కావడంతో జడ్పీ చైర్మన్ పదవికి రాజీనామా చేశానని ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కడప కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయరామరాజును కలిసి రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఆతనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ఒక పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిందన్నారు. తమ మూడేళ్ల జడ్పీ చైర్మన్ పాలనలో జిల్లా అభివృద్ధికి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషిచేశానన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలతో పాటు, అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన కనీస మౌలిక వసతులను కల్పించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకున్నామన్నారు. సాధారణ ఎన్నికల్లో ప్రజా తీర్పును శిరసా వహిస్తున్నామన్నారు. గెలుపొందిన కొత్త శాసన సభ్యులందరికి శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయ వివక్ష లేకుండా జిల్లా అభివృద్ధికి పాటుపడాలన్నారు.

వెంటలేని జడ్పీ పాలకమండలి సభ్యులు

జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి తన పదవికి రాజీనామా చేస్తున్న సమయంలో ఆయన వెంట పాలక మండలి సభ్యులు ఎవరూ కనిపించలేదు. ఆయన 2021 సెప్టెంబర్‌లో జరిగిన జడ్పీటీసీ ఎన్నికల్లో ఒంటిమిట్ట మండల జడ్పీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ తరువాత అదే ఏడాది సెప్టెంబర్ 25న జడ్పీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. రెండు సంవత్సరాల తొమ్మిది నెలల పాటు చైర్మన్‌గా కొనసాగి పలు స్టాండింగ్ కమిటీ సమావేశాలను, జడ్పీ సర్వసభ్య సమావేశాలను నిర్వహించారు. అయితే సమావేశాల అనంతరం ఆయన జడ్పీటీసీలకు అందుబాటులో ఉండేవారు కాదని అంటారు. దీనికి తోడు ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం కొలువుదీరనుంది. ఈ నేపథ్యంలో జడ్పీ చైర్మన్ పదవికి ఆకేపాటి రాజీనామా చేస్తున్నారనే విషయం తెలిసినా పాలకమండలి సభ్యులు ఆయన వెంట ఎవ్వరూ వెళ్లలేదు.


రాజీనామా అనంతరం మీడియాతో మాట్లాడుతున్న ఆకేపాటి

ఉపాధ్యాయుల బదిలీలలు

- డబ్బు వసూళ్ల స్కామ్‌లో రాయచోటి బాధితులు
- రూ.1.5 కోట్ల వసూలు
- చక్రం తిప్పిన ఓ ఉపాధ్యాయ సంఘం నేత
- బదిలీలు ఆగిపోవడంతో బాధితుల గగ్గోలు



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): సబ్బుబిళ్ల.. కుక్కపిల్ల.. అగ్గిపెట్టె.. కాదేదీ కవితకనర్హం.. ఇవి శ్రీశ్రీ గారు అన్నమాటలు.. అచ్చం అలాగే.. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అక్రమాలు, అవినీతి జరగని శాఖ లేదంటే అతిశయోక్తి లేదేమో. సమాజంలో ఎంతో పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తికే మచ్చతెచ్చేలా కొందరు ఉపాధ్యాయులు అక్రమ బదిలీలకు తెరలేపారు. రాయచోటికి చెందిన వైఎస్సార్ టీఎఫ్ సంఘ నాయకుడు ఒకరు కోట్ల రూపాయలు అధికా రులకు లంచంగా ఇప్పించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం మారడంతో ఈ అక్రమ బదిలీలకు ఫుల్‌స్టాప్ పడింది. ఇప్పటి వరకు జరిగిన బదిలీలను నిలుపుదల చేసింది. దీంతో ఈ బదిలీ కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసిన బాధితులు గగ్గోలు పెడుతున్నారు. ఈ అక్రమ బది లీల స్కామ్‌లో రాయచోటికి చెందిన సుమారు 30 మంది బాధితులు రూ.1.5 కోట్లు పోగొట్టుకున్నారు. ఇప్పుడు తమ డబ్బు ఇవ్వమని ఆ ఉపాధ్యాయ సంఘ నేతను అడుగుతున్నారు. తమ డబ్బు ఇవ్వకపోతే.. పోలీసులను ఆశ్రయిస్తామని పేర్కొంటున్నారు. ప్రస్తుతం జిల్లా ఉపాధ్యాయవర్గాల్లో చర్చనీయాంశంగా మారిన ఈ బాగోతం వివరాల్లోకి వెళితే..

జిల్లాలో పలువురు ఉపాధ్యాయులు తాము పని చేస్తున్న చోట నుంచి కోరు కున్న చోటుకు బదిలీ కావాలని అనుకున్నారు. సాధారణంగా ప్రభుత్వం బదిలీలకు అవకాశం ఇచ్చినపుడే బదిలీలు జరగాలి. అయితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో నిబంధనలు, ఒప్పందా లతో సంబంధం లేకుండా జరగని పనంటూ ఉండదు. అడిగినంత డబ్బు ఇవ్వగలిగితే చాలు ఏ పనైనా అయిపోతుంది. దీన్ని ఆసరాగా చేసుకున్న ఓ వైఎస్సార్ టీఎఫ్ (వైఎస్సార్ ఉపా ధ్యాయ ఫెడరేషన్) నాయకుడు రంగంలోకి దిగారు. గతంలో ఉమ్మడి కడప జిల్లాలో విద్యా శాఖలో ముఖ్య అధికారిగా పని చేసి.. ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో ఉన్న అధికారితోనూ, అన్న మయ్య జిల్లా విద్యాశాఖలో ఉన్నతాధికారిగా పని చేసి.. ప్రస్తుతం పక్క జిల్లాలోనే అంతకంటే పైస్థాయి ఉన్నతాధికారిగా ఉన్న అధికారితోనూ ఉన్న పరిచయాలను ఉపయోగించుకున్నాడు. సరిగ్గా ఎన్నికల ముందు బదిలీల పేరిట వ్యవహారానికి తెరలేపారు.

ఉమ్మడి కడప జిల్లాలో 90కి పైగా అక్రమ బదిలీలు జరిగాయి. ఇందులో 30 వరకు రాయచోటి ప్రాంతానికి చెందిన వారివే ఉన్నాయి. ఒక్కో ఉపాధ్యాయుడి నుంచి సుమారు రూ.5లక్షలకు పైగా ~ రూ.1.5 కోట్లు వసూలు చేసినట్లు సమాచారం. అంతేకాక స్థానిక ఎమ్మెల్యే సిఫార్సు లేఖ పేరుతో.. ఒక్కో ఉపాధ్యాయుడి నుంచి అదనంగా రూ.లక్ష, కోరుకున్న స్థానానికి బదిలీ కావ డానికి అదనంగా మరో రూ.50వేలు వసూలు చేశారు. ఇలా వసూలు చేసిన డబ్బు సదరు ఇద్దరు ఉన్నతాధికారులకు ఇచ్చినట్లు సమాచారం. అయితే ప్రభుత్వం మారడంతో అక్రమ బదిలీలు ఆగిపోయాయి. దీంతో ఒక్కసారిగా బాధిత ఉపాధ్యాయులు గగ్గోలు పెడుతున్నారు. లక్షలు పోసి బదిలీలు చేసుకున్నాం.. తీరా అవి ఇప్పుడు నిలిచిపోయాయి. మా డబ్బు మాకు ఇవ్వండి.. అని బాధిత ఉపాధ్యాయులు సదరు ఉపాధ్యాయ సంఘం నాయకుడిని గట్టిగా నిలదీసినట్లు తెలుస్తోంది. డబ్బు ఇవ్వకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించినట్లు సమాచారం. జిల్లా అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ స్కామ్‌పైన విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య



ఇంజేటి ఉదయ్ మృతదేహం

జమ్మలమడుగు, జూన్ 7: జమ్మలమడుగు మండలంలోని గొరిగెనూరు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం ఇంజేటి ఉదయ్ (30) అనే వ్యక్తి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు మృతుడు ఇంజేటి ఉదయ్ మండలంలోని గొరిగెనూరు గ్రామం ఎస్సీ కాలనీకి చెందినవాడు. ఈయనకు పది సంవత్సరాల క్రితం ఆళ్లగడ్డ పెద్దకందుకూరు గ్రామంలో వివాహం చేశారన్నారు. ఈయనకు ఇద్దరు కుమారులు, కాగా మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అప్పటి నుంచి ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడేవాడరన్నారు. కాగా శుక్రవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన పరిశీలించేందుకు అర్బన్ సీఐ కరుణాకర్, పోలీసు సిబ్బంది గ్రామంలో సందర్శించి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

18 తులాల బంగారు, నగదు చోరీ



బీరువా పగలకొట్టి చోరీ చేసిన దృశ్యం

ఎర్రగుంట్ల, జూన్ 7: ఎర్రగుంట్ల సీఎస్ఆర్ కాలనీలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. కాలనీలో నివాసం ఉంటున్న లింగాల బాలగంగిరెడ్డి ఎన్నికల సందర్భంగా తమ గ్రామం తురకపల్లెకు వెళ్లినట్లు తెలిపారు. ప్రతి రోజూ తాను వచ్చి ఇంట్లో లైట్ వేసి వెళుతున్నానని, గురువారం మాత్రం రాలేదన్నారు. గురువారం తెల్లవారుజామున 5గంటలకు పనిమనిషి శ్రీవల్లి వచ్చి చూడగా తలుపుల బీగం పగలగొట్టి తెరచి వుండటంతో తనకు సమాచారం ఇచ్చిందన్నారు. తాను వచ్చి చూడగా బీరువాలో ఉన్న బంగారు, డబ్బును, ఇంటి, స్థలాల ఒరిజినల్ పత్రాలు చోరీచేసి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. 3తులాల లాంగ్‌చైన్,4తులాల 4గాజులు,2తులాల రాళ్లహారం, 2తులాల రెండు చైన్లు,3తులాల ఒక చైన్,మూడు జతల జుంకీల కమ్మలు,4ఉంగరాలతోపాటు రూ.1.5లక్షల నగదును, ఇంటి, స్థలాల ఒరిజినల్ పత్రాలు చోరీ చేసినట్లు గంగిరెడ్డి తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్ టీం వచ్చి వేలిముద్రలను సేకరించింది. ఈవిషయంపై పోలీసులు విచారిస్తున్నారు. ఇటీవలే తన కుటుంబం హైదరాబాదు నుంచి వచ్చిందని అందువల్లే బంగారం ఇక్కడ ఉంచినట్లు తెలిపారు.

దుప్పిపై కుక్కల దాడి



కుక్కలనుంచి దుప్పిని కాపాడిన దర్బార్‌బాషా

సీకేదిన్నె, జూన్ 7: కుక్కల దాడిలో దుప్పి గాయపడటంతో గ్రామస్థులు రక్షించి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. చింతకొమ్మదిన్నె మండలం మద్దిమడుగు వద్ద శుక్రవారం అడవిలో నుంచి వచ్చిన దుప్పి కుక్కలబారిన పడింది. వాటి నుంచి రక్షించుకునేందుకు ఎంత ప్రయత్నించినా కుక్కలు వదలకపోవడంతో గ్రామంలోకి వచ్చింది. దీంతో ఆ గ్రామానికి చెందిన జబ్బార్ బాషా కుక్కలను తరిమికొట్టి దుప్పిని రక్షించారు. గాయపడిన దుప్పిని ఇంటివద్దనే చెట్టుకు కట్టివేసి కుక్కలు రాకుండా రక్షణ కల్పించారు. అనంతరం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించి వారి స్వాధీనం చేశారు. దీంతో గ్రామస్థులు దర్బార్‌బాషాను అభినందించారు.

రైస్‌మిల్లుల్లో విజిలెన్స్ తనిఖీలు

రూ.1.75లక్షలు జరిమానా



రైస్ మిల్లులో తనిఖీ చేస్తున్న అధికారులు

మైదుకూరు, జూన్ 7 : పట్టణంలోని 2 ప్రధాన రైస్‌మిల్లులపై విజిలెన్స్ తూనికల శాఖ అధికారులు దాడులు చేసి, రూ 1.75లక్షలు జరిమానా విధించారు. పట్టణంలోని శ్రీలక్ష్మి గణేష, శ్రీలక్ష్మి సుబ్బరాయ మాడరన్ రైస్ మిల్లులపై శుక్రవారం కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌర సరఫరాలు, తూనిక కొలతల శాఖ అధికారులు మూకుమ్మడిగా దాడి చేశారు. అక్కడ ఉన్న బియ్యం బస్తాల నిల్వలు వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. బియ్యపు బస్తాలపై ప్యాకింగ్ తేదీలు, వాటి వివరాలు లేవని నిర్ధారించి, తూనిక, కొలతల శాఖాధికారులు రూ.75 వేలు, మిల్లుకు సంబంధించి వివరాలతో కూడిన సూచిక బోర్డులు లేవని లక్ష రూపాయలు జరిమానా విధించినట్లు అధికారులు షేక్ మాసుంబాష తెలిపారు. ఈ తనిఖీలో సీఐలు టి రెడ్డప్ప, ఈదురుబాష, అర్జున్‌రావు, సివిల్ సరఫరా అధికారి తారకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణంలో...



రాంనగర్‌లోని 7వ రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న పౌరసరఫరాల అధికారులు

ప్రొద్దుటూరు, జూన్ 7 : ప్రొద్దుటూరు పట్టణం రామనగర్‌లో 7వ నెంబరు రేషన్ దుకాణం నుంచి అక్రమంగా బియ్యం తరలించటంపై వచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం జిల్లా పౌర సరఫరాల అధికారి చాముండేశ్వరి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో డీలర్ వద్ద వున్న స్టాకు, ఎండీయూ ఆపరేటర్ వద్దవున్న స్టాకును పరిశీలించారు. బియ్యంనిల్వల్లో ఎంత వ్యత్యాసం తేడాలున్నాయో పూర్తి స్థాయిలో పరిశీలించి విచారణ నివేదికను పంపాలని ఆర్ఐ సాయిప్రసాద్‌ను ఆదేశించారు. షాపులో దాదాపు 172 బియ్యం బస్తాలు వున్నట్లు ప్రాథమిక సమాచారం. అయితే వీటిని తూకం వేసి నిల్వల్లో తేడాలను గుర్తించి జిల్లా అధికారికి నివేదిస్తామని ఆర్ఐ సాయిప్రసాద్ తెలిపారు.

బడిబస్సులు భద్రమేనా ?



బద్వేలు ఆర్టీవో కార్యాలయంలో ఎఫ్‌సీల కోసం క్యూలో ఉన్న విద్యాసంస్థల బస్సులు

- త్వరలో ప్రారంభం కానున్న విద్యాసంవత్సరం
- పిల్లల భద్రత అత్యంత కీలకం
- స్కూలు బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరి

బద్వేలుటౌన్, జూన్ 7: విద్యాసంస్థలకు సంబంధించిన బస్సుల ఫిట్‌నెస్‌లపై రవాణాశాఖ అధికారులు దృష్టిసారించారు. పిల్లలకు ఉత్తమ విద్యను అందించాలని తల్లిదండ్రులు ఇప్పటికే భారీగా ఫీజులు చెల్లించి ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చేర్పిస్తున్నారు. కేవలం పిల్లల చదువులపై మాత్రమే కాకుండా వారు నిత్యం ఇంటినుంచి పాఠశాలలకు, కళాశాలలకు రాకపోకలు సాగించే బస్సుల సామర్థ్యంపై కూడా దృష్టి సారించాలి. బడిబస్సులు భద్రంగా ఉంటే పాఠశాల పిల్లల ప్రయాణం సురక్షితంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో విద్యాసంస్థల యజమానులు బస్సుల నిర్వాహణపై జాగ్రత్తలు తీసుకోవాలని, పాఠశాలల పునఃప్రారంభానికి ముందే బస్సు సామర్థ్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సూచిస్తున్నారు. విద్యార్థుల కోసం సిద్ధంగా ఉన్న వాహనాలు కండీషన్లలో ఉన్నాయా లేదా అనేదానిపై క్షుణ్ణంగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. బద్వేలు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ పరిధిలోని కాశినాయన, కలసపాడు, బి.కోడూరు, బద్వేలు, గోపవరం, అట్లూరు, పోరుమామిళ్ల, మైదుకూరు మండలాల్లో 240 పాఠశాలల బస్సులున్నాయి. ఆ వాహనాలకు సంబంధించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అవసరమని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సూచిస్తున్నారు. ఆ వాహనాలకు సంబంధించిన అన్నిరకాల పత్రాలు ఉన్నాయా లేదా అని పరిశీలిస్తూ అనుమతులు లేనివాటికి జరిమానాలు, కేసులు నమోదు చేస్తున్నారు.

నిబంధనలు తప్పనిసరి

విద్యాసంస్థలు తమ వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాలంటే రవాణాశాఖ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. లేదంటే ఫిట్‌నెస్ పరీక్షకు అనర్హతవేటు వేస్తారు. విద్యాసంస్థల వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాలంటే సదరు వాహనం డ్రైవర్‌కు వయస్సు 60 ఏళ్ల లోపు ఉండాలి. డ్రైవర్ ఆరోగ్యంగా, కంటిచూపు సక్రమంగా ఉండాలి. డ్రైవర్ ఆరోగ్యానికి సంబంధించిన బాధ్యతలను విద్యాసంస్థలు చూసుకోవాలి. పాఠశాల యాజమాన్యం డ్రైవర్లను తీసుకునే ముందు రవాణా శాఖ అధికారులకు కచ్చితంగా తెలియజేయాలి. డ్రైవర్‌కు హెవీడ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. బస్సులో అత్యవసర ద్వారం ఉండి, ఫస్ట్‌ఎయిడ్‌బాక్స్ అగ్నిమాపక పరికరాలను కచ్చితంగా కలిగి ఉండాలి. అలాంటి వసతులు కలిగిన వాహనాలకు మాత్రమే పరీక్షలు నిర్వహించిన అనంతరం అధికారులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

విద్యాసంస్థల బస్సుల నిర్వహణలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. ప్రస్తుతం స్కూలు బస్సులకు ఎఫ్‌సీల రెన్యువల్ కొనసాగుతోంది. నిర్దేశిత సమయంలోగా తప్పనిసరిగా ఎఫ్‌సీ రెన్యువల్ చేసుకోవాల్సిందే ఎఫ్‌సీలు, ఇతర పత్రాలు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా స్కూలు బస్సులు రోడ్డుపై నడిపితే చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతూ పట్టుబడితే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది.

- శేఖర్‌రావు,
మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, బద్వేలు



ప్రైవేటు బస్సులను పరిశీలిస్తున్న అధికారులు

కుందూకు భారీగా వరద



రాజుపాలెం, జూన్ 7 : కర్నూలు జిల్లాలో పడుతున్న వర్షాలకు కుందూకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. శుక్రవారం రాజోలి ఆనకట్ట వద్ద 6080 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని అధికారులు తెలిపారు. వర్షాలు భారీగా పడుతుండడంతో ఈ ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అన్నారు. కుందూకు ఇరువైపులా పంటలు సాగు చేసిన రైతన్నలకు ఈ వర్షం నీరు ఆశలు పుట్టిస్తోంది. ఖరీఫ్ మొదలు కావడంతో కుందూకు ఇరువైపులా వరినార్లు పోసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. రాబోవు రోజుల్లో మరింత వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఇక పంటలకు ఇబ్బంది లేకుండా కుందూ ప్రవహిస్తుందని రైతుల్లో ఈ వర్షం నీరు ఆశ రేకెత్తుతోంది.

సింహాద్రిపురంలో వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

సింహాద్రిపురం, జూన్ 7: సింహాద్రిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో అబ్బాస్ అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన వంశీధర్‌రెడ్డి దాడి చేశాడని ఈమేరకు శుక్రవారం కేసు నమోదు చేశామని ఎస్ఐ అనీల్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ సమాచారం మేరకు.. బాధితుడు అబ్బాస్ సింహాద్రిపురం బస్టాండు సమీపంలో బజారులో ఉండగా అదేసమయంలో అక్కడికి వంశీధర్‌రెడ్డి వచ్చారు. వారిద్దరి మధ్య మాటమాట పెరిగి ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. వంశీధర్‌రెడ్డి అబ్బాస్‌ను రాడ్డుతో కొట్టి గాయపరిచాడు. అబ్బాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. బాధితుడు అబ్బాస్ చికిత్స నిమిత్తం 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అన్నదానానికి రూ.100116 విరాళం



నరసారెడ్డికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏసీ ముకుందరెడ్డి

చక్రాయపేట, జూన్ 7: ప్రసిద్ధ గండి క్షేత్రంలో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రూ.100116 విరాళం వచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. శనివారం గండి కార్యాలయంలో రాజంపేట మండలం పెద్దూరు ఆకేపాడుకు చెందిన టంగుటూరు నరసారెడ్డి కుటుంబ సభ్యులు ఈ విరాళం అందించినట్లు తెలిపారు. వారికి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటం, శేషవస్త్రంతో వేద ఆశీర్వచనం అందించినట్లు ముకుందరెడ్డి తెలిపారు.

డిజిటల్ పేమెంట్‌లో మొదటి స్థానంలో ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు క్రైం, జూన్ 7 : ప్రభుత్వ మద్యం దుకాణాల్లో డిజిటల్ పేమెంట్స్ చెల్లింపులో రాష్ట్రంలో ప్రొద్దుటూరు మొదటి స్థానంలో ఉందని ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్ తిమ్మరాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక మద్యం దుకాణాలను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ లిక్కర్ డిపో పరిధిలోని ప్రొద్దుటూరు, మైదుకూరు, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, బద్వేల్ నియోజకవర్గాలోని మద్యం దుకాణాల్లో గత నెల రూ.63.42 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయని తెలిపారు. మద్యం దుకాణాల్లో అక్రమాలకు పాల్పడిన ఇద్దరు సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్‌పై చర్యలు తీసుకున్నామని తెలిపార. అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని మద్యం సిబ్బందిని ఆయన హెచ్చరించారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



ఎస్టీయూ అన్నమయ్య జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

రాయచోటిటౌన్, జూన్7: ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏపీ శాసన మండలి మాజీ సభ్యుడు కత్తి నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలో జరిగిన ఎస్టీయూ మొదటి కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకువచ్చిన 117 జీవో ఉపాధ్యాయుల ఉద్యోగాలకు ప్రమాదకరంగా మారిందన్నారు, రేషనలైజేషన్‌లో భాగంగా ఉపాధ్యాయుల పోస్టులను కుదించడం ద్వారా పిల్లలను నాణ్యమైన విద్య అందుబాటులోకి రాలేదన్నారు. కొత్త ప్రభుత్వం ఆ జీవోను రద్దు చేసి ఇంగ్లిష్ మీడియం కొనసాగించాలన్నారు. సంఘ నాయకులతో చర్చించి వారి డిమాండ్లను పరిష్కరించాలన్నారు. అనంతరం ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్, మల్లు రఘునాథ్‌రెడ్డిలు మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగుల బకాయిలను త్వరలో చెల్లించాలని, హెల్త్‌కార్డులను పూర్తి స్థాయిలో విని వినియోగంలోకి తీసుకురావాలని, సీపీఎస్ రద్దుకు చొరవ చూపాలన్నారు. 12వ వేతన సవరణ సంఘం సిఫారసుల అమలుకు చొరవచూపడంతోపాటు, మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంకరం శివారెడ్డి, పోకల మధుసూదన్, రాష్ట్ర ఉపాధ్యాయనీ సంపాదకులు గాజుల నాగేశ్వరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్రమణ్యంరాజు, ఆదినారాయణరెడ్డి, కడియాల మురళి, మహేశ్వరిరెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ బదిలీలపై కొరడా

- ఎన్నికల ముందు అడ్డగోలు బదిలీలు
- ప్రభుత్వం మారడంతో నిలుపుదల
- లబోదిబోమంటున్న 150 మంది టీచర్లు



కడప (ఎడ్యుకేషన్), జూన్ 7: మాదే అధికారం, అంతా మా ఇష్టం, మమ్మల్ని ఎవరురా ఆపేది. మేం చెప్పిందే రూల్, మేం ఏదైనా చేయగలమంటూ వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలకు తెర లేపింది. ముడుపులు ఇస్తే చాలు నిబంధనలు సైతం పట్టించుకోకుండా బదిలీలు చేసింది. అయితే ఎన్నికల కోడ్ రావడంతో బదిలీల ప్రక్రియ నిలిచింది. ఎన్నికలు పూర్తయిన తరువాత బదిలీలు చేసేందుకు విద్యాశాఖ నడుం బిగించింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో వైసీపీ చేసిన అవకతవకలకు పరిశీలించాలని, అంతవరకు అవన్నీ నిలుపుదల చేయాలనే సంకేతాలు అధికారులకు రావడంతో అక్రమ బదిలీలకు సైతం బ్రేక్ పడినట్లయింది. దీంతో జిల్లా నుంచి బదిలీల కోసం ముడుపులు చెల్లించిన దాదాపు 150 మంది ఉపాధ్యాయులు లబోదిబోమంటున్నారు.

గత ఏడాది ఆగస్టులో వైసీపీ ప్రభుత్వం అడ్డగోలు బదిలీలకు తెర లేపింది. విద్యాశాఖ మంత్రి కార్యాలయం కేంద్రంగా ఈ వ్యవహారం కొనసాగింది. జిల్లా నుంచి దాదాపు 80 మందికి పైగా ఉపాధ్యాయులు కోరుకున్న స్థానాలకు బదిలీ ఆర్డర్లు తెచ్చుకున్నారు. ఒక్కో ఉపాధ్యాయుడు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఇచ్చినట్లు సమాచారం. అయితే వారు అనుకున్న నగరాలకు సమీపంలో ఖాళీలు లేకపోవడంతో ఆ ఉత్తర్వులు అలాగే నిలిచిపోయాయి. ఖాళీలు ఏర్పడ్డాక చేరదామని పక్కనబెట్టారు. తాజాగా ఎన్నికలకు ముందు మరో 70 మంది వరకు ఉపాధ్యాయులకు బదిలీ ఉత్తర్వులు జారీ చేసి కోడ్ ముగిసిన తరువాత జిల్లాలో దాదాపు 150 మందికి పైగా ఉపాధ్యాయులను రిలీవ్‌కావాలని పాఠశాల విద్యాశాఖ పీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఆ బదిలీలను నిలుపుదల చేస్తూ పీఎస్ ప్రవీణ్ ప్రకాశ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యవహారంలో పాఠశాల విద్యాశాఖలోని కొందరు అధికారులు, కొన్ని ఉపాధ్యాయ సంఘాల నేతలు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మరికొందరు ఉద్యోగుల పాత్ర కూడా ఉండడం చర్చనీయాంశమైంది.

లబోదిబోమంటున్న ఉపాధ్యాయులు

ఏదో ముడుపులు చెల్లించి కోరుకున్న పాఠశాలకు బదిలీ చేసుకుందామనుకున్న ఉపాధ్యాయులు బదిలీ ఉత్తర్వులు నిలుపుదల చేయడంతో లబోదిబోమంటున్నారు. సాధారణంగా ఉపాధ్యాయులు ఎంతో ఆలోచన చేసి అది అత్యవసరం అయితేనే ఖర్చు చేస్తారు. వృధా ఖర్చు చేసే ఆలోచన ఎంత మాత్రం చేయరు. అటువంటిది బదిలీల కోసం లక్షల రూపాయలు ముడుపులు చెల్లించారు. వైసీపీ ప్రభుత్వం మళ్లీ వస్తుంది, తాము కోరుకున్న పాఠశాలలకు చేరిపోతామనుకున్నారు. అయితే వారి వ్యూహం బెడిసి కొట్టింది. లక్షల రూపాయలు గంగపాలయ్యాయని ఆవేదన చెందుతున్నారు. తిరిగి అడుగుదామనుకున్నా ప్రభుత్వం కూడా లేదు. ఉపాధ్యాయ సంఘ నాయకులు కూడా ముఖం చాటేస్తున్నారని తెలుస్తోంది. అధికారులను అయితే అడగలేని పరిస్థితి. మళ్లీ వారితో ఏం పని పడుతుందోనన్న భయం. దీంతో ముడుపులు చెల్లించిన ఉపాధ్యాయులు గోడు ఎవరికి చెప్పాలో తెలియక లబోదిబోమంటున్నారు.

నేటి నుంచి రేణుక యల్లమ్మ తిరుణాల

గాలివీడు, జూన్7: నూలివీడు పంచాయతీ నాగూరు వాండ్లపల్లె సమీపంలో శనివారం నుంచి రేణుక యల్లమ్మ తిరుణాల జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతిఏటా మొలకల పౌర్ణమి తర్వాత వచ్చే అమావాస్య రోజు పుట్టపూజతో అమ్మవారి ఊరేగింపు ప్రారంభమవుతుంది. గురు, శుక్రవారాల్లో నూలివీడులోని వివిధ పల్లెల్లో అమ్మవారిని ఊరేగించారు. శనివారం రాత్రికి చాందినీ బండ్లు ఏర్పాటు చేయనున్నారు. ఉదయం గ్రామ ప్రజలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.

నేడు, రేపు మాతమ్మ తిరుణాల

సుండుపల్లె, జూన్7: మండల కేంద్రానికి సమీపంలోని పెద్దమాదిగపల్లెలో శని, ఆదివారాల్లో మాతమ్మ తిరుణాల నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. శనివారం ఉదయం పూజలు, ఆదివారం హోమం, రాత్రికి రంగు రంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో చాందినీ బండ్ల ప్రదక్షిణలు ఉంటాయన్నారు

మంచాలమ్మకు పూజలు

సుండుపల్లె, జూన్ 7: మం డలంలోని జీ. రెడ్డివారిపల్లెలో శనివారం మంచాలమ్మకు అ భిషేకం, పూజలు నిర్వహిం చారు. రాత్రికి తిరుణాల ని ర్వహిస్తున్నట్లు తెలిపారు. సుండుపల్లె మండలంతో పా టు కేవీపల్లె మండలం నుం చి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి గంగమ్మ జాతర

పెనగలూరు, జూన్ 7 : మండలంలోని ఇండ్లూరు హరిజనవాడలో శనివారం నుంచి ఆదివారం సాయంత్రం వరకు గంగమ్మ జాతర జరుగుతుందని నిర్వాహకులు పెనుబాల జయరామయ్య, బద్దల రామకృష్ణ, సురేష్ బాబు, జంగా రమణయ్య, సుబ్రమణ్యం తెలిపారు. శనివారం ఉదయం వేములూరుకు చెందిన కళా బృందం ఆసాది కథను వినిపిస్తూ చక్రబండరాళ్లకు పూజ చేస్తారన్నారు. సాయంత్రం గంగమ్మకు పూజలు నిర్వహించి, పొలిమేరలలో అష్ట దిగ్బంధం రాళ్లను ప్రతిష్టిస్తారని తెలిపారు. తెల్లవారు జామున పోతులరాజుతో గంగమ్మ ఊరేగింపు నిర్వహించి జంతు బలులతో జాతర పూర్తి చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా లక్ష రూపాయల ఖర్చుతో అరుంధతీ వాడ మార్గం, పెనగలూరు బస్టాండు కూడలి, కొత్తపల్లెలోని పీర్లచావిడి వద్ద, గంగమ్మ దేవాలయం, ఇండ్లూరు హరిజన వాడలో విద్యుద్దీపాలతో అమ్మవారి ప్రతిరూపాలను ఏర్పాటుచేశారు.

ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

లక్కిరెడ్డిపల్లె జూన్7: ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్క రించాలని మోడల్ స్కూల్స్ ప్రోగ్రె సివ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్య క్షుడు కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి శుక్రవారం విజయవాడ లో టీడీపీ నేషనల్ పొలిటికల్ సెక్రెటరీ టీజీ జనార్దన్‌కు విన్నవించారు. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి నూతన ప్రభుత్వా నికి శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీను కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



పరామర్శిస్తున్న బీకేఎంయూ, సీపీఐ నాయకులు

రైల్వేకోడూరు(రూరల్) జూన్ 7: పొలంలో పని చేస్తూ విద్యుత్ షాక్‌తో మృతి చెందిన శ్రీను కుటుంబాన్ని ఆదుకోవాలని బీకేఎంయూ జిల్లా అధ్యక్షులు పందుగోల మణి, సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్, సహాయ కార్యదర్శి మొగిలి వినయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని సుర్పరాజు పల్లెలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు ఏడీఈ భాస్కర్‌తో మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి అందాల్సిన పరిహారం అందిం చేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

కుక్కలున్నాయి.. పిక్కలు జాగ్రత్త!

● వీధుల్లో తిరిగేందుకు భయపడుతున్న జనం ● పట్టించుకోని పంచాయతీ అధికారులు



మండల కేంద్రంలో వీధి కుక్కల స్వైర విహారం



గుంపుగా చేరిన వీధి కుక్కలు

సుండుపల్లె, జూన్7: సరిగ్గా వారం రోజుల క్రితం సుండుపల్లె మండల కేంద్రంలో సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డుకు అడ్డంగా పరిగెత్తుతున్న కుక్కను తప్పించబోయి రోజు వారీ కూలీ నాగయ్య (45) తీవ్ర గాయాలపాలయ్యాడు. అలాగే సుండుపల్లె మండల కేంద్రంలోని కార్తికేయ నగర్‌కు చెందిన హరినాథ్‌రెడ్డి పిచ్చికుక్క కాటుకు గురై ఇబ్బందులకు గురయ్యారు.

శునకాల కారణంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకోవడం నిత్యకృత్యమవుతున్నా... అటు పంచాయతీ అధికారులు, ఇటు పాలకవర్గం గానీ స్పందించడం లేదు. ఇవి గుంపులుగా మండల కేంద్రంలో తిరుగుతూ పౌరులను భయాందోళనల కు గురిచేస్తున్నాయి. పలువురు కుక్క కాట్లకు గురై ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకుంటున్నారు. చీకటి పడితే వాటి ఆగడాలు పెచ్చుమీరు తున్నాయి. పలు వీధుల్లో పాదచారులు, వాహన చోదకులు వెంటపడు తున్నాయి. వీటి సంతతి నియంత్రించేందుకు అధికారులు శ్రద్ధ చూపకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఐదేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వం లో శునకాలను పట్టుకోవడానికి బోనులు తయారు చేయించారు. పట్టుకున్న వాటికి సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేయించడంతోపాటు రేబిస్ నియంత్రణకు వ్యాక్సిన్లు వేయించారు. అయితే వైసీపీ పాలనలో అటువంటి చర్యలు తీసుకోకపోవడం ప్రజలకు శాపంగా మారింది. గ్రామ పంచాయతీకి ఏటా కోట్ల రూపాయల ఆదాయం ఉన్నా కుక్కల నివారణకు నిధులు కేటాయించకపోవడం గమనార్హం.

పొట్ట నింపుకునేందుకు రోడ్ల మీదకి..

ఆహారం కొరత, అధిక ఉష్ణోగ్రతల ప్రభావం శునకాలపై కనిపిస్తోంది. ఎవరైనా వాటిని కవ్వించే ప్రయత్నం చేస్తే దూకుడుగా మీదకు వస్తున్నాయి. వీటికి ఆహారం, నీళ్ల లభ్యం కాని పరిస్థితులు మండలంలో ఎక్కువగా ఉన్నాయి. దీంతో ఇవి వాటి పొట్ట నింపుకో వడం కోసం మాంసం దుకాణాల వద్ద పదుల సంఖ్యలో చేరుతు న్నాయి. దుకాణం యజమాని విసిరి పారేసే ఎముకల కోసం ఇవి ఎగపడుతున్నాయి. వీటి వల్ల పిల్లలు ఒంటరిగా రాకపోకలు సాగించడానికి భయపడు తున్నారు.

దృష్టి సారిస్తాం



కుక్కలను చంపకూడదని మార్గదర్శకాలు ఉన్నాయి. వీటిని పట్టుకుని సంతాన నియంత్రణ శస్త్ర చికిత్స చేయించి, కోలుకున్న తరువాత విడిచిపెట్టారు. కొన్నేళ్లుగా శస్త్ర చికిత్సలు చేయించకపోవడం నిజమే. శునకాల బెడద నివారించాలంటూ ప్రజా ప్రతినిధులు, పౌరుల నుంచి విజ్ఞాపనలు వస్తున్నాయి. ఏం చేయాలన్న దానిపై త్వరలోనే చర్చిస్తాం. వాటి బారినుంచి ప్రజలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటాం.

- ఈవోపీఆర్డీ సురేశ్, సుండుపల్లె

విజ్ఞాన భాండాగారాలు గ్రంథాలయాలు

సంబేపల్లె, జూన్ 7: విజ్ఞాన సముపార్జనకు సోపానాలు గ్రంథాలయాలు అని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం సంబేపల్లె శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పుస్తక పఠనంతో జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునన్నారు. గ్రంథాలయాల్లోని పుస్తకాల్లో ఉన్న ప్రపంచ చరిత్ర అంతా మీ కళ్ల ముందు కనిపిస్తుందని తెలిపారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలంటే గ్రంథాలయాలు దోహదపడతాయన్నారు. ప్రతి ఏడాది వేసవిలో నిర్వహించే సమ్మర్ క్యాంప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమ్మర్ క్యాంప్ నిర్వహించిన గ్రంథాలయశాఖ అధికారి రెడ్డిశేఖర్‌ను ఈ సందర్భంగా అభినందించారు. వ్యాసరచన, డ్రాయింగ్, క్యారమ్స్ పోటీ విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రెడ్డిశేఖర్, ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, శశికళ, సుశీల, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సంబేపల్లె: బహుమతి ప్రదానం చేస్తున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్

రైల్వేకోడూరు(రూరల్): వేసవి శిబిరం ముగింపు సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్, మ్యాథ్స్, తెలుగు, వ్యాస రచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారి పోతురాజు రామయ్య శుక్రవారం బహుమతి ప్రదానం చేశారు. గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు, విశ్రాంత ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్య శర్మ, బాలాజీ, నగేష్ సామాజిక కార్యకర్త శంకరయ్య తదితరులు పాల్గొన్నారు...



రైల్వేకోడూరు: బహుమతులు అందిస్తున్న మండల విద్యాశాఖ అధికారి రామయ్య

కోడూరు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు

పెనగలూరు, జూన్ 7 :కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్ రూపానందరెడ్డిని మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానుల శుభాకాంక్షలు చెబుతున్నారు. ఫలితాలు వెలువడిన నాటి నుంచి శుక్రవారం వరకు రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులతోపాటు ఓటర్లు తండోప తండాలుగా ముక్కావారిపల్లెకు చేరుకుని శాలువాలు, పూల మాలలు, బొకేలు ఇచ్చి వస్తున్నారు. నల్లపురెడ్డిపల్లె, నారాయణ నెల్లూరు,కట్టావారిపల్లె, ఓబిలి, తిరుణంపల్లె, సిరివరం, పెనగలూరు ప్రాంతాల నుంచి భారీగా పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చారు. శుక్రవారం డీసీసీబీ మాజీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసులరెడ్డి,, యువ నాయకులు కొప్పోలు విజయభాస్కర్‌రెడ్డి, బాలిరెడ్డి,రెడ్డయ్య, నరేష్‌బాబు, కొత్త బాలకృష్ణ, వేణుగోపాల్‌నాయుడు, ప్రసాద్‌నాయుడు, ఆనంద నాయుడు, బయనబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, సుబ్బరాయుడు, చంద్రమోహన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు టీఎన్ఎస్ఎఫ్ నేతల పాదయాత్ర

రైల్వేకోడూరు(రూరల్) జూన్ 7: ఎన్నికల్లో టీడీపీ పార్టీ అఖండ విజయం సాధించడంతో తిరుమలకు పాదయాత్ర చేస్తున్నట్లు టీఎన్ఎస్ఎఫ్ కడప పార్లమెంట్ అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్ తెలిపారు. శుక్రవారం పాదయాత్ర రైల్వేకోడూరుకు చేరడంతో రాయలసీమ విద్యార్థి పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మల్లెం హేమంత్ కుమార్ ఘన స్వాగతం పలికారు. పూలమాల వేసి, శాలువా కప్పి సన్మానించారు. రాష్ట్రంలో రాక్షస పాలన అంతం అయిందని రామరాజ్యం వచ్చిందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్, నరసింహ, వంశీ, పరుశురామ్, సురేంద్ర, గంగాధర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస రెడ్డికి సన్మానం



శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న టీడీపీనాయకులు

ఒంటిమిట్ట, జూన్ 7 : టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాస రెడ్డిని శుక్రవారం కడపలోని ఆయన స్వగృహంలో మండలంలోని సీనియర్ టీడీపీ నాయకులు కొమర వెంకటనరసయ్య ఆధ్వర్యంలో గజమాలతో సత్కరించారు. అనంతరం కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీకి కార్యకర్తలకు విముక్తి కలిగిందని రాబోవు రోజుల్లో టీడీపీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని నాయకులకు శ్రీనివాసులరెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ ఆదినారాయణ, మోదుగుల నరసింహులు, బీవీ రమణ, మాజీ సర్పంచు శ్రీహరి, రఘురాంరెడ్డి, వెంకటేష్, వినోద్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అప్రజాస్వామిక నిర్ణయాలతోనే వైసీపీ ఓటమి



మాట్లాడుతున్న సీపీఎం నేత వెంకటేశ్వర్లు

రాయచోటిటౌన్, జూన్7: అప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకొని ప్రజలు, కార్మికులు, కర్షకులు, ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయడంతోనే వైసీపీ ఘోర ఓటమిని చవి చూసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఎన్నికల సమీక్షతో పాటు జిల్లాలోని ఖరీఫ్ సీజన్‌లో రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇసుక, మద్యం మాఫియా, కొండలు, గుట్టలు, భూ అక్రమణలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల మాటతీరు వంటి ఎన్నో ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజలను విసిగించాయని చెప్పారు. రైతులకు పంట నష్టపరిహారం, విద్యార్థులకు వసతి దీవెన చెల్లింపులు మూడేళ్ల పెండింగ్ పెట్టడం, అంగన్వాడీ, ఆశా, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు జీతాలు చెల్లించకపోగా వారితో కన్నీళ్లు పెట్టేలా వ్యవహరించిందన్నారు. డ్రిప్ ఇరిగేషన్‌కు సబ్సిడీ తీసేసిందన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం వైసీపీని చూసి పాఠాలు నేర్చుకొని ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పీ. శ్రీనివాసులు, జిల్లా క మిటీ సభ్యులు వెంకట్రామయ్య, రవికుమార్, అబ్బవరం రామాంజులు పాల్గొన్నారు.

పునాది అభ్యసనంతోనే ప్రాథమిక విద్య బలోపేతం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూన్7: ప్రాథమిక విద్యలో పునాది అభ్యసనానికి ఎంతో ప్రాధాన్యం ఉందని, తెలుగు, గణితంలో పునాది అభ్యసనంతోనే ప్రాథమిక విద్య బలోపేతం అవుతుందని అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి అన్నారు. రాయచోటి డైట్ కళాశాలలో గురువారం శుక్ర వారం జరిగిన డీఆర్పీల రెండు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక విద్యను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా గతేడాది ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ 60 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా జిల్లాలో ఎంపిక చేసి 90 మంది డీఆర్పీలకు రెండు రోజులకు రిఫ్రెషన్ ట్రైనింగ్ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణ పొందిన డీఆర్పీలు తిరిగి మండల స్థాయిలో రాష్ట్ర ఉన్నతాధికారులు నిర్ణయించిన తేదీల్లో ప్రాథమిక పాఠశాలలు ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మొదటి రోజు స్టేట్ అబ్జర్వర్‌గా గిరిబాబుయాదవ్, రీసోర్స్ పర్సన్స్(ఏఆర్పీ)గా ఉపేంద్రకుమార్, శ్యామలదేవి, డైట్ లెక్చరర్స్ రెడ్డెయ్య వ్యవహరించారు.

'అక్రమాలకు చరమగీతం పాడుతాం'



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మండిపల్లె లక్ష్మీప్రసాద్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, జూన్7: వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలకు చరమగీతం పాడుతామని ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లెకు వచ్చిన ఆయనకు షేక్‌అరీఫుల్లా ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. .ఈ సందర్భంగా నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లెలో రోడ్లు, పక్కాభవనాలు, డ్రైనేజీ సమస్యలు వంద రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. వైసీపీ పరిపాలనలో ఇబ్బందులు పడ్డ కార్యకర్తల సమస్యల పరిష్కరిస్తామన్నారు. లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు మండలాల ప్రజలను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. లక్కిరెడ్డిపల్లెలో నెలకోసారి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధా లా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు ఎర్రగుడి చంద్రశేఖర్ రెడ్డి, ఏ 1 కాంట్రాక్టర్ పాపయ్య, సిద్దక వెంకటరామిరెడ్డి, మండల యువ నాయకుడు ఎంపీటీసీ సభ్యుడు మదన్ మోహన్ , రాజంపేట డాక్టర్ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ షఫీనాయక్, బాలకృష్ణారెడ్డి, వెంకటరామరాజు, కావలి ఆంజనేయులు, సుదర్శన్‌బాబు, ఇక్బా ర్, మసూద్, దేవనాథరెడ్డి, చలపతినాయుడు, మండ్ల రామాంజనేయులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

ఎస్సీ వసతి గృహాల పరిశీలన

లక్కిరెడ్డిపల్లె జూన్7: లక్కిరెడ్డిపల్లె లోని ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను శుక్రవారం సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ రామసుబ్బయ్య పరిశీలించారు. ఈ వసతిగృహాల భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు వాటిలో ఉండేందుకు భయపడుతున్నారని ఉన్నతాధికారులకు నివేదికలు పంపు తున్నట్లు తెలిపారు. 2024 విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానాలు అమలవుతాయన్నారు. కొత్త మెనూ ఉంటుందని యూనిఫాం, నోటు పుస్తకాలు విద్యా సామగ్రి అందిస్తామన్నారు ఈ కార్యక్రమంలో వార్డన్లు, శ్రీనివాసులు, రమేష్, సావిత్రి సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీడీ రామసుబ్బయ్య

వాటర్ కూలర్ ఏర్పాటు

నందలూరు, జూన్ 7 : స్థానిక కాలప్ప గుడి ఆవరణలో లయన్స్ వాకర్స్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కుర్రా మణియాదవ్, సామల రామచంద్రయ్య, వీరబల్లి జయకుమార్‌రెడ్డి ఆర్థిక సహకారంతో శుక్రవారం వాటర్ కూలర్ ఏర్పాటు చేశారు. నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ సర్పంచు జంబు సూర్యనారాయణ క్లబ్ ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మోడపోతుల రాము, శ్యామనబోయిన గురుప్రసాద్, కొత్తపల్లె రాజాచారి, కానకుర్తి వెంకటయ్య, గాడి సునీల్‌రెడ్డి, ఆంజనేయులు, రిటైర్డ్ తహసీల్దార్ జయన్న, గొబ్బిళ్ళ మణి, గుండు సురేష్, కిరణ్, శ్రీరామ హరినాథ్, మేస్త్రి శంకర్, మట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



వాటర్ కూలర్‌ను ప్రారంభిస్తున్న దాతలు

అరవ శ్రీధర్ గెలుపుతో సంబరాలు



పెంచలకోనలో రూపానందరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్ కుటుంబసభ్యులు

ఓబులవారిపల్లె, జూన్ 7 : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోనూ, నియోజకవర్గంలోనూ ఎన్‌డీఏ గెలుపు సాధించడంతో టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి కుటుంబ సమేతంగా పెంచలకోనలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి వెళ్ళి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్ మాట్లాడుతూ దేవుని దయవల్ల నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ఆశీర్వాదంతో గెలుపు సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మి, కుమారులు సాయివికాస్‌రెడ్డి, సాయి విశాల్‌రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడును కలిసిన మేడా విజయశేఖర్‌రెడ్డి

నందలూరు, జూన్ 7 : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ మంత్రి, టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే కింజరపు అచ్చెన్నాయుడును ఆయన స్వగృహంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట నందలూరు మండలం లేబాక గ్రామ సర్పంచు వెంకటనరసయ్య, తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు రాముయాదవ్, ఎంఆర్‌పీఎస్ నాయకులు సాతపల్లి వెంకటేష్ తదితరులున్నారు.



అచ్చెన్నాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మేడా విజయశేఖర్

శీతల గంగమ్మకు టీడీపీ నేతల పూజలు

సిద్దవటం,జూన్ 7 : ఎన్‌డీఏ కూటమి విజయం సాధించడంతో టీడీపీ నేతలు శుక్రవారం మాధవరం గ్రామ పంచాయతీ పార్వతీపురంలో పాలకవర్గ సభ్యుడు వెంకటరత్నం ఆధ్వ ర్యంలో శీతల గంగమ్మ అమ్మవారికి 101 కొబ్బరి కాయలు కొట్టి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య, పార్లమెంటు వాణిజ్య అధికార ప్రతినిధి ఎన్ఆర్ఐ చంద్ర, తెలుగుదేశం పార్టీ నాయకులు చెంచయ్యనాయుడు, అసెంబ్లీ అధికార ప్రతినిధి రామ్మోహన్‌నాయుడు, మండల ఎస్‌సీ సెల్ అధ్యక్షుడు హరి, బూత్ కమిటీ కన్వీనర్ డేరంగుల శ్రీకాంత్, నాగేంద్ర, రామకృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.



శీతల గంగమ్మ ఆలయం వద్ద టెంకాయలు కొడుతున్న టీడీపీ నాయకులు

కూటమి విజయంపై మైనారిటీ నాయకుల సంబరాలు

రైల్వేకోడూరు(రూరల్) జూన్ 7: జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ విజయంతో పట్టణంలోని మైనారిటీ సీనియర్ నాయకులు పట్టాన్ మౌలా, రాష్ట్ర టీడీపీ మైనారిటీ కార్యదర్శి షేక్ జుబేర్ ఆధ్వర్యంలో సంబరాలు చేశారు. శుక్రవారం పట్టణంలోని జామియా మసీద్ వద్ద కోడూరు మాజీ ఉపసర్పంచ్ నార్జాల హేమరాజ్, యువ నాయకులు వార్డు సభ్యులు పోతురాజు నవీన్ ఆధ్వర్యంలో ముస్లింలకు స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమికి మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు మస్తాన్ సాహెబ్, సుదర్శన్ రాజు, షేక్ అజీమ్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.



మసీద్ వద్ద స్వీట్లు పంచుతున్న మైనారిటీ నాయకులు..

నాగబాబుకు శుభాకాంక్షలు

పెనగలూరు, జూన్ 7 : జనసేన జాతీయ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబును కుటుంబ సమేతంగా కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లె కళాచంద్ర తెలిపారు. ఎన్‌డీఏ కూటమి ఘన విజయం సాధించడం పట్ల మండలంలోని పార్టీ విజయం కోసం టీడీపీ ,జనసేన, బీజేపీ కార్యకర్తలుచేసిన కృషిని ఆయనకు వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబసభ్యులు సుమతి, విఘ్నేశ్వర్, యశ్వం త్, రాజేశ్వరిలు పాల్గొన్నారు.

అమాత్యులెవరు?

అందరిలోనూ ఆశలు

ఒకట్రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం

మంత్రి పదవులపై సర్వత్రా చర్చ

చిత్తూరు ఎంపీకి కేంద్ర మంత్రిగా ఛాన్సు

రాష్ట్ర మంత్రి పదవి కోసం పలువురి యత్నాలు


అమరనాథరెడ్డి

నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి



దగ్గుమళ్ల ప్రసాదరావు

రాష్ట్రంలో అధికారం మారిన నేపథ్యంలో రేపు ప్రధానిగా నరేంద్ర మోదీ, అలాగే ఈనెల 12న సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారాలు చేయనున్నారు. ఆయా తేదీల్లోనే కేంద్ర, రాష్ట్ర మంత్రివర్గాలు కూడా ఏర్పాటయ్యే అవకాశాలున్నాయి. లేదంటే కొన్ని రోజుల ఆలస్యం అయినా మొత్తం మీద ఈ నెలలోనే పూర్తిస్థాయి కేంద్ర, రాష్ట్ర మంత్రివర్గాలు ఏర్పాటు కానున్నాయి. దీంతో జిల్లా నుంచీ ఎవరెవరికి మంత్రి పదవులు లభించే అవకాశముంది? ఏ ప్రాతిపదికన? అన్న అంశాలు సర్వత్రా చర్చనీయాంశమవుతున్నాయి. కూటమిలో ఏ పార్టీలో ఎవరికి? సామాజికవర్గాల రీత్యా అయితే ఎవరికి? కొత్త జిల్లాల ప్రకారమా లేక ఉమ్మడి జిల్లాల ప్రకారమా? అన్న ప్రశ్నలు అటు రాజకీయ వర్గాలతోపాటు జనంలోనూ వినిపిస్తున్నాయి. మరోవైపు ఈ చర్చలతో నిమిత్తం లేకుండా జిల్లా నుంచీ పలువురు ఎమ్మెల్యేలు మంత్రి పదవి కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు.

తిరుపతి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వర్గాల సమాచారం మేరకు కేంద్ర మంత్రివర్గంలో ఎస్సీ సామాజికవర్గం నుంచీ చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేరు పరిశీలనలో వుంది. అధిష్ఠానం వద్ద గణనీయమైన పలుకుబడి వున్న కారణంగానే ఆయన ప్రకాశం జిల్లావాసి అయినా చిత్తూరు ఎంపీ టికెట్ తెచ్చుకున్నారని, దానికి తోడు ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థుల విజయానికి వీలైన మేరకు ఆర్థికంగా సహకరించారని ఆ వర్గాలు చెబుతున్నాయి. ఉన్నత విద్యావంతుడు కావడం, అఖిల భారత సర్వీసుల అధికారిగా పనిచేసిన నేపథ్యం,అధిష్ఠానం వద్ద పలుకుబడి ఆయనకు అదనపు అర్హత కాగలదని సమాచారం.

రాష్ట్ర మంత్రులుగా ప్రచారంలో ఇద్దరి పేర్లు

తిరుపతి, ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లో ఎవరికి మంత్రి పదవులు లభిస్తాయన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారుతోంది. ఉమ్మడి జిల్లాలో 14 స్థానాలు, నెల్లూరు నుంచీ కొత్తగా తిరుపతి పరిధిలోకి చేరిన మూడు స్థానాలూ కలిపి మొత్తం 17 స్థానాలకు గానూ 15 చోట్ల కూటమి అభ్యర్థులు గెలిచిన సంగతి తెలిసిందే. అందులో ఒకరు జనసేన కాగా మిగిలిన వారు టీడీపీకి చెందినవారు. కొత్త జిల్లాల ప్రాతిపదికన మంత్రి పదవులకు ఇద్దరి పేర్లు ప్రచారంలో వున్నాయి. చిత్తూరు జిల్లా నుంచీ పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, అన్నమయ్య జిల్లా నుంచీ పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అమరనాథరెడ్డి విషయానికి వస్తే కుటుంబానికి సుదీర్ఘ రాజకీయ నేపథ్యం వుండడం, డీసీసీబీ ఛైర్మన్‌గా, ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో పాటు ఉమ్మడి జిల్లా టీడీపీ అధ్యక్షుడిగానూ, మంత్రిగానూ పనిచేసిన అనుభవం ఆయనకు అర్హతలని చెబుతున్నాయి. జిల్లాలో నాయకులను సమన్వయం చేసుకుని పార్టీని ముందుకు నడిపించిన నేతగా ఆయనకు అధిష్ఠానం వద్ద ప్రత్యేక గుర్తింపు వుంది. దానికి తోడు స్థానిక సంస్థల ఎన్నికల్లో కుప్పంలో అధికార పార్టీ వర్గాల ఆగడాలను ఎదుర్కొనడం, నారా లోకేశ్ యువగళం పాదయాత్ర నిర్వహణలో రాయలసీమవ్యాప్తంగా కీలక బాధ్యతలు నిర్వర్తించడం, ఆ క్రమంలో 24 పోలీసు కేసులను ఎదుర్కొనడం ఆయనకు కలసివస్తుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇక పీలేరు ఎమ్మెల్యే కిషోర్ కుటుంబానికి సైతం సుదీర్ఘ రాజకీయ నేపథ్యం వున్న సంగతి తెలిసిందే. తండ్రి మంత్రిగా, అన్న సీఎంగా పనిచేసి వుండడంతో పాటు కిషోర్ గత టీడీపీ ప్రభుత్వంలో హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేశారు. పార్టీలో జాతీయ ప్రధాన కార్యదర్శి పదవితో అధిష్ఠానం ఆయనకు ప్రత్యేక గుర్తింపు కల్పించింది. పుంగనూరు సెగ్మెంట్‌లో వైసీపీ ముఖ్యనేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎదుర్కోవడంతో పాటు తంబళ్ళపల్లి, మదనపల్లె నియోజకవర్గాల్లో కూడా పార్టీ బలోపేతానికి కృషి చేశారన్న పేరుంది. చంద్రబాబుపై కురబలకోటలో వైసీపీ దాడుల ఘటనకు సంబంధించి కిషోర్ పోలీసు కేసులు కూడా ఎదుర్కొన్నారు. వీటన్నింటికీ మించి రాజంపేట పార్లమెంటు పరిధిలో మొత్తం ఏడు స్థానాలకు గానూ వైసీపీ మూడు అసెంబ్లీ సీట్లు, ఒక ఎంపీ సీటు గెలిచి బలంగా ఉనికి చాటుకుంది. అక్కడ టీడీపీ రెండు సీట్లకు, జనసేన ఒక సీటుకు పరిమితమయ్యాయి. అలాంటి చోట పార్టీని బలోపేతం చేసి ముందుకు తీసుకెళ్ళడానికి కిషోర్ సేవలు అవసరమని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఎస్సీ సామాజిక వర్గం నుంచీ...

వైద్యరంగంలో ప్రముఖుడు కావడం, అధినేత చంద్రబాబుతో సన్నిహితత్వం వుండడం,మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తెను ఓడించడం వంటి కారణాలతో గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే థామస్‌కు ఎస్సీ కోటాలో మంత్రి పదవి దక్కుతుందని స్థానిక పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.ఎస్సీ మహిళ కోటాలో వైద్యురాలైన సూళ్ళూరుపేట యువ ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి మంత్రివర్గంలో చోటుదక్కే అవకాశాల్లేకపోలేదని అక్కడి పార్టీ శ్రేణులు ఆశాభావంతో వున్నాయి. తండ్రి గతంలో ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేసి వుండడం ఆమెకు అనుకూలిస్తుందని చెబుతున్నాయి. అలాగే గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సీనియారిటీ కారణంగా ఎస్సీ కోటాలో ఛాన్సుంటుందని ఆయన అనుచరవర్గం నమ్ముతోంది. వైసీపీ ముఖ్యనేత పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డిని సవాల్ చేసిన నేతగా పేరుతెచ్చుకోవడంతో పాటు సత్యవేడులో సంచలన విజయం సాధించిన కోనేటి ఆదిమూలం మంత్రి పదవికి అర్హుడని అక్కడి పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఇలా మంత్రి పదవుల కోసం తిరుపతి, ఉమ్మడి చిత్తూరు జిల్లాల పరిధిలో విస్తృతస్థాయిలో జనం మధ్య చర్చ నడుస్తోంది. రానున్న ఒకటి రెండు రోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది.

సామాజికవర్గాలవారీగా అవకాశాలపై ఆశలు

సామాజిక సమీకరణలు, కూటమి పార్టీల సమీకరణల దృష్ట్యా పలువురు మంత్రి పదవులు ఆశిస్తున్నారు. మదనపల్లె నుంచీ టీడీపీ తరఫున గెలిచిన షాజహన్ బాషాకు ముస్లిం మైనారిటీ కోటాలో మంత్రి పదవి దక్కుతుందని ముస్లిం మైనారిటీ వర్గాలు ఆశిస్తున్నాయి.తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు రాయలసీమ మొత్తం మీద జనసేన తరఫున బలిజ సామాజిక వర్గం నుంచీ గెలిచిన ఏకైక ఎమ్మెల్యే కావడంతో ఆయనకు మంత్రి పదవి గ్యారంటీ అని ఆ సామాజికవర్గం గట్టి నమ్మకంతో వుంది. ఆ మేరకు ఆయన కూడా తన ప్రయత్నాలు ముమ్మరం చేశారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కుటుంబ నేపథ్యం, ఆయన తండ్రి దివంగత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అధినేత చంద్రబాబుకు సన్నిహిత మిత్రుడు కావడం వంటి కారణాలతో తిరుపతి జిల్లా నుంచీ ఆయనకు అవకాశం వుంటుందని అక్కడి పార్టీ వర్గాలు విశ్వసిస్తున్నాయి. ఇక చిత్తూరు జిల్లాలో మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడు కుమారుడైన నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్‌కు ఛాన్సు దక్కుతుందని ఆయన అనుచరులు భావిస్తున్నారు.టీడీపీకి కంట్లో నలుసుగా మారిన మాజీ మంత్రి రోజాను భారీ మెజారిటీతో ఓడించిన భానుకు మంత్రి పదవి తప్పక దక్కుతుందన్న విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.ఇక తిరుపతి జిల్లాలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ గురించి చెప్పక్కర్లేదు.చంద్రబాబు సొంత నియోజకవర్గమైన చం ద్రగిరిలో పాతికేళ్ళ తర్వాత రికార్డు మెజారిటీతో గెలిచిన నానీకి అధినేత వద్ద,యువనేత లోకేశ్ వద్ద ప్రత్యేక గుర్తిం పు వుంది. గత ప్రభుత్వంలో అధికార పార్టీని ఎదుర్కొని, పార్టీని బలోపేతం చేసే క్రమంలో అనేక ఇబ్బందులకు గురైన నానీకి మంత్రి పదవితో అధిష్ఠానం న్యాయం చేస్తుందని చంద్రగిరి పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సీనియర్ నేత కావడంతో పాటు వియ్యంకుడైన పారిశ్రామికవేత్త గంగాప్రసాద్ అధినేత చంద్రబాబుకు సన్నిహితుడు కావడం వల్ల అవకాశాల్లేకపోలేదని అనుచరవర్గం ఆశాభావంతో వుంది. మాజీ సీఎం నేదురుమల్లి జనార్దనరెడ్డి కుమారుడిని ఓడించడం అదనపు అర్హతగా భావిస్తోంది.

సురేష్ పిళ్లై నవలకు రెడ్డెమ్మ పురస్కారం

● 12న చిత్తూరులో బహుమతుల కార్యక్రమం


కేఏ మునిసురేష్ పిళ్లై

చిత్తూరు కల్చరల్, జూన్ 7: చిత్తూరు నగరంలోని రాజామహల్ హోటల్‌లో ఈనెల 12న కుప్పం రెడ్డెమ్మ జాతీయస్థాయి సాహితి పురస్కారాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ కె. రామలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోహిణి పంజారి రచించిన 'నల్లసూరీడు', డాక్టర్ ఎం.సుగణరావు రచించిన 'సుగుణ కథాభిరామం' కథలు బహుతులకు ఎంపికయ్యాయని తెలిపారు. అలాగే శ్రీకాళహస్తికి చెందిన రచయిత కె.ఎ.మునిసురేష్ పిళ్ళై రచించిన 'పుత్రిక శత్రు', సి.కాశిపురం ప్రభాకర్ రెడ్డి రచించిన 'మేడం' నవలకు బహుమతులు లభించినట్లు వివరించారు.

చంద్రబాబు, లోకేశ్‌తో మాట్లాడించాలని.. సెల్ టవర్ ఎక్కాడు

యాదమరి,జూన్7: మద్యం మత్తులో వృద్ధుడు సెల్‌టవర్ ఎక్కాడు. పోలీసుల వివరాల మేరకు.. యాదమరి మండల పరిధిలోని కోణాపల్లెకు చెందిన మనోహర్ నాయుడు(65) మద్యం తాగి ఆ మత్తులో గ్రామశివారులో ఉన్న సెల్‌టవర్ ఎక్కాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్ఐ రామాంజనేయులు అక్కడికి చేరుకుని కిందకు దిగమని కోరగా చంద్రబాబు, లోకేశ్‌తో మాట్లాడిస్తే కిందకు దిగుతానని చెప్పాడు.చంద్రబాబు జిల్లాకు వచ్చినప్పుడు మాట్లాడిస్తామని ఎస్ఐ చెప్పడంతో ఆయన కిందకు దిగాడు.

ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి

ముఖేష్ కుమార్ మీనా



తిరుమల, జూన్6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిన సందర్భంగా శ్రీవారి ఆశీస్సులు తీసుకునేందుకు వచ్చినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. తిరుమల వేంకటేశ్వరస్వామిని శుక్రవారం ఉదయం దర్శించుకున్న ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి లడ్డూప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియను ప్రొఫెషనల్ పద్ధతిలో నిర్వహించామన్నారు. కొత్త ప్రభుత్వం బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధంగా ఉందన్నారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



తిరుమల, జూన్7(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకమండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

లక్ష్మీనరసింహా స్వామి ఆలయంలో చోరీ

పూతలపట్టు, జూన్ 7: మండలంలోని కమ్మగుట్టపల్లి గ్రామ సమీపంలో గల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆలయ తాళాలు పగులగొట్టి గర్భగుడిలోకి ప్రవేశించి మూడు వెండి కిరీటాలు, వెండి వక్షస్థలం, నాలుగు హస్తాలు, పాదాలు, కలశ చెంబు, గంధపు గిన్నె, అష్టలక్ష్మి చెంబుతో కలిపి 15 వెండి ఆభరణాలు చోరీ చేశారు. వీటి విలువ రూ.25 లక్షలు ఉంటుందని గ్రామస్తులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. హుండీని పగులగొట్టి నగదు తీసుకెళ్లారు. చిత్తూరు టౌన్ డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి, పూతలపట్టు సీఐ సుదర్శన్ ప్రసాద్, క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌లతో వెళ్లి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సహనం కోల్పోకండి

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలంటూ తిరుపతి పోలీసుల విజ్ఞప్తి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 7 : ఎన్నికల ఫలితాలు వెలువడ్డ తరువాత కొన్ని ప్రాంతాల్లో వర్గ వైషమ్యాలు, హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకర మైనప్పటికీ ప్రజలెవరూ సహనం కోల్పోకూడదని ఎస్పీ హర్షవర్ధనరాజు ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.అనవసరంగా ఆవేశాలకు లోనై హింస చెలరేగే విధంగా ఎవరూ ప్రవర్తించకూడదన్నారు.చట్ట పరిధిలో అందరూ సమానమనే విషయం మరిచిపోకూడదన్నారు. రౌడీయిజం, దౌర్జన్యం ఎవ్వరు చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ఎప్పటిలాగే ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.

నగరిలో టీడీపీ జైత్రయాత్ర

రెండు మున్సిపాలిటీలు, ఐదు మండలాల్లోనూ పూర్తి ఆధిక్యత ● చారిత్రాత్మక ఓటమి మూటగట్టుకున్న రోజా

పుత్తూరు అర్బన్/నగరి, జూన్ 7: అశ్వమేధ యాగంలో యాగాశ్వం అడుగు పెట్టిన చోటల్లా ఆ రాజ్యం వశమైనట్లు నగరి అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అంతకుమించి జైత్రయాత్రను సాగించింది. నియోజకవర్గ పరిధిలోని రెండు మున్సిపాలిటీలు, ఐదు మండలాల్లోనూ పూర్తిస్థాయి ఆధిక్యతతో క్లీన్ స్వీప్ చేసింది. వైసీపీ కంచుకోటలను బద్దలు కొట్టింది. దీంతో రెండు దఫాలు అత్తెసరు మెజార్టీతో గెలిచిన వైసీపీ అభ్యర్థి రోజా.. ఈఎన్నికల్లో భారీ ఓటమిని మూటకట్టుకున్నారు. టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ అప్రతిహత విజయాన్ని సొంతం చేసుకున్నారు.

తొలి రౌండ్ నుంచే మొదలు

టీడీపీ జైత్రయాత్ర తొలి రౌండ్ అయిన వడమాలపేట నుంచే మొదలైంది. గత రెండు ఎన్నికల్లో వడమాలపేట ఇచ్చిన మెజార్టీతోనే వైసీపీ గెలుపొందింది. అలాంటి కంచుకోటలో ఇప్పుడు టీడీపీకి 6165 ఓట్ల మెజార్టీ లభించింది. దీంతో టీడీపీ గెలుపు ఖాయమనే అంచనా బలపడింది. ఈ ఐదేళ్లలో వడమాలపేటలో జరిగిన భూ ఆక్రమణలు ఎన్నడూ జరగలేదనే ప్రచారం ఉంది. దీంతో వైసీపీ అభిమానులు కూడా ఈ దఫా టీడీపీకి పట్టం కట్టారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పుత్తూరు మున్సిపాలిటీ సాధారణంగా టీడీపీకి అనుకూలం. ఈసారి అనూహ్యంగా 12,827 ఓట్ల మెజార్టీని సాధించింది. వైసీపీ దాడులు, దౌర్జన్యాలు, పోలీసు కేసులతో విసిగిపోయిన పట్టణ ఓటర్లు టీడీపీకి ఏకపక్ష విజయాన్ని కట్టబెట్టారనే మాటలు వినబడుతున్నాయి. అలాగే, వైసీపీకి కంచుకోట అయిన పుత్తూరు మండలంలోన టీడీపీకి 3,203 ఓట్ల ఆధిక్యత లభించింది. నగరి మున్సిపాలిటీ ఈ దఫా కూడా టీడీపీకి అండగా నిలిచింది. మెజార్టీ మాత్రం ఏకంగా 11,928కి ఎగబాకింది. నగరి రూరల్‌లోనూ 2,954 ఓట్ల మెజార్టీ లభించింది. హోరాహోరీగా ఉండే నిండ్ర మండలంలో ఈసారి 3,689 ఓట్ల మెజార్టీ వచ్చింది. టీడీపీకి అనుకూలంగా ఉండే విజయపురం మండలం.. ఈ దఫా 3,099 ఓట్ల మెజార్టీని ఇచ్చింది. పోస్టల్ బ్యాలెట్లలోనూ 1,139 ఓట్ల ఆధిక్యత లభించింది. ఇలా ప్రతి రౌండ్‌లోనూ మెజారిటీ సాధించిన టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ 45,004 ఓట్ల మెజార్టీతో విజయకేతనం ఎగురవేశారు.

కకావికలమైన వైసీపీ...

నగరి నియోజకవర్గంలో టీడీపీ జోరుతో వైసీపీ కకావికలమైంది. అన్ని మండలాలు, మున్సిపాలిటీలను టీడీపీ క్లీన్ స్వీప్ చేస్తుండటంతో కౌంటింగ్ కేంద్రంలో వైసీపీ చేష్టలుడిగి చూస్తూ ఉండిపోయింది. రోజా భర్త సెల్వమణి సొంత సామాజికవర్గమైన మొదలియార్ బెల్ట్‌ను టీడీపీ క్లీన్ స్వీప్ చేసింది. పుత్తూరులోని గేటు పుత్తూరు, నగరి మున్సిపాలిటీలోని సత్రవాడ, కేవీఆర్ పేట, పుదుపేట, ఏకాంబరకుప్పంలో మొదలియార్ సామాజిక వర్గం ఏకపక్షంగా టీడీపీ వైపు మొగ్గుచూపింది. ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో సరాసరి ఐదు, ఆరు వందల మెజార్టీ టీడీపీ సాధించింది. రూరల్, అర్బన్ అనే తేడా లేకుండా ఓటర్లు ఏకపక్షంగా టీడీపీకి అనుకూలంగా తీర్పునిచ్చారు. ఈ ఐదేళ్ల పాలనలో నగరి నియోజవకర్గంలో జరిగిన విధ్వంసాలు, దౌర్జన్యాలు, భూఆక్రమణలు, సెటిల్‌మెంట్లు, పోలీసు కేసులతో విసిగిన నియోజకవర్గ వాసులు వైసీపీని చీదరించుకున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో రాష్ట్ర మంత్రి హోదాలో బరిలోకి దిగిన రోజాకు గతంలో ఎవరికీ దక్కనంత భారీ ఓటమి పొందారు.

రాజీనామా చేసి వెళ్లండి

ఎస్వీయూ వీసీకి తెలుగు యువత విజ్ఞప్తి


ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డితో మాట్లాడుతున్న తెలుగు యువత నాయకులు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), జూన్ 7: 'టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.. వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైన మీరు పదవికి రాజీనామా చేసి వెళ్లండి' అంటూ ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డికి తెలుగు యువత నాయకులు విజ్ఞప్తి చేశారు. తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనంద్‌గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి శేషాద్రి నాయుడు, నాయకులు రామ్మోహన్, కృష్ణమూర్తి తదితరులు శుక్రవారం వీసీ చాంబర్‌కు వెళ్లి పదవికి రాజీనామా చేయాలంటూ వీసీ శ్రీకాంత్‌రెడ్డికి సూచించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వీసీగా వచ్చిన రాజేంద్ర ప్రసాద్‌ను గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్రంగా అవమానించి.. పంపారని గుర్తుచేశారు. అలాంటి పని చేయబోమని, తమకు సంస్కారం ఉందని చెప్పారు. అందువల్ల పదవికి రాజీనామా చేయాలని కోరారు. ఇక ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేసినట్లు తమ వద్ద వాయిస్ మెసేజ్‌లు ఉన్నాయని, గత వీసీ రాజేంద్రప్రసాద్ పదవి నుంచి పంపడంలో మీప్రమేయం కూడా ఉందని ఆరోపించారు. తనకు తెలిసిన ఓ టీడీపీ ఎమ్మెల్యేతో సంప్రదించి నిర్ణయం తీసుకుంటానని వీసీ చెప్పగా, తెలుగు యువత నాయకులు ససేమిరా అన్నారు. దీంతో తీవ్ర వాగ్వాదం జరగడంతో సెక్యూరిటీ సిబ్బంది ఇటు వీసీని, అటు నాయకులకు సర్దిజెప్పారు. ఈ క్రమంలో వీసీ తన చాంబర్ నుంచి వెళ్లిపోయారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పదవులు పొందినవారు స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని ఆనంద్‌గౌడ్ సూచించారు. లేకుంటే తామే పదవుల నుంచి సాగనంపుతామని స్పష్టం చేశారు. కాగా, టీడీపీ, తెలుగు యువత నాయకుల ఆందోళనతో ఎస్వీయూ వీసీ బంగ్లా వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బ్యాంకులో అప్పు ఉందని పింఛను ఇవ్వలేదు

● వృద్ధురాలి ఆవేదన


పింఛను కోసం బ్యాంకు దగ్గర వేచి ఉన్న వృద్ధురాలు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 7: బ్యాంకులో అప్పు ఉందని బ్యాంకు అధికారులు తనకు పింఛన్ ఇవ్వలేదని వృద్ధురాలు వజ్రమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆమె బ్యాంకు వద్ద మీడియాతో మాట్లాడుతూ.. తన పేరుతో ఉన్న భూమిపై తన ఇద్దరు కుమారులు సప్తగిరి గ్రామీణ బ్యాంకులో క్రాప్‌లోన్ తీసుకున్నారని తెలిపారు. వారు లోన్ చెల్లించనందున ప్రభుత్వం తనకు మంజూరు చేసిన పింఛన్‌ను బ్యాంకు అధికారులు ఇవ్వలేదన్నారు. తన కుమారులు చూడకపోవడంతో తాను పింఛన్ డబ్బులతో జీవితం గడుపుతున్నట్లు తెలిపారు. అధికారులు తనకు పింఛన్ ఇప్పించాలని ఆమె కోరుతున్నారు. బ్యాంకు అధికారులు వృద్ధుల పింఛన్ నగదును బాకీ పేరుతో నిలుపుదల చేయడం దారుణమని సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య ఖండించారు. ఈ విషయంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఇసుక రవాణాను అడ్డుకున్న టీడీపీ

● పోలీసులకు ఇసుక ట్రాక్టర్ల అప్పగింత


టీడీపీ నాయకులు ఆపేసిన ఇసుక ట్రాక్టర్

ఏర్పేడు, జూన్ 7: ఏర్పేడు మండలం మునగలపాళెం, వికృతమాల సరిహద్దులో శుక్రవారం ఉదయం ఇసుకను ట్రాక్టర్ల ద్వారా కొంతమంది అక్రమ రవాణా చేస్తున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన స్థానిక టీడీపీ నేతలు సతీష్ నాయుడు, జనార్దన్, హేమాక్షి తదితరులు స్వర్ణముఖి ప్రాంతానికి వెళ్లి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఈ క్రమంలో రెండు ట్రాక్టర్లు తప్పించుకున్నాయి. మిగిలిన ఒక ట్రాక్టరును అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. వికృతమాల గ్రామానికి చెందిన వైసీపీ నేత ఒకరు ఇసుక తరలించడంతో ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నేత సతీష్ నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకున్న వారంతా ఇక ఇసుక అక్రమ రవాణాకు స్వస్తి చెప్పాలన్నారు. ఇకపై టీడీపీ ప్రభుత్వం సహించదని హెచ్చరించారు.

ఏపీకి స్వర్ణయుగం మొదలైంది

నటుడు శివాజి



తిరుమల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): 'స్వామిని చూస్తే కళకళలాడుతున్నారు. ఇంతకుముందు తేడాగా ఉన్నారు. స్వామి దగ్గర డ్రామాలు దొబ్బితే ఎవరికైనా ఇదే శిక్ష అని సినీనటుడు శివాజీ వ్యాఖ్యానించారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఏపీకి స్వర్ణయుగం మొదలైందని, ఇది స్వామి నిర్ణయమన్నారు.అమరావతి, పోలవరం ఏపీకి లక్ష్యాలని, స్వామి దగ్గర మాట ఇచ్చినోళ్లకి ఎటువంటి పాఠాలు నేర్పించాడో అందరూ చూశారన్నారు.చంద్రబాబు నాయకత్వాన టీడీపీ, బీజేపీ, జనసేన ఆధ్వర్యంలో ఏపీ అద్భుతమైన ప్రగతి సాధిస్తుందన్నారు. అందులో ఎలాంటి అనుమానం లేదన్నారు. 'మీరు తిట్టినా కొట్టినా తిరిగి కర్మ మీ చుట్టూ తిరిగింది. మిమల్ని ప్రజలు తిడుతున్నారు, కొడుతున్నారు. అవసరమా' అని వైసీపీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎవరైనా ప్రజలను ఇబ్బంది పెట్టకూడదన్నారు. కాగా, బాలీవుడ్ నిర్మాత ఏక్తాకపూర్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

ములకలచెరువులో భారీ వర్షం

ములకలచెరువు, జూన్ 7: ములకలచెరువులో భారీ వర్షం కురిసింది. గురువారం రాత్రి సుమారు గంటకుపైగా భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు ప్రవహించాయి. అలాగే ముంబాయి - చెన్నై జాతీయ రహదారిలో వర్షపు నీరు భారీగా ప్రవహించాయి. భారీ వర్షంతో ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగింది. భారీ వర్షంతో రైతులు వేరుశెనగ సాగుపై దృష్టి సారించారు. ములకలచెరువులో 65.6 మి.మీ. భారీ వర్షపాతం నమోదైంది.

అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

● గిరిజన కాలనీలో విద్యుత్ సమస్యలతో సతమతమవుతున్న ప్రజలు ● కనెక్షన్ రాక ఎండుతున్న పంటలతో రైతు ఆక్రందన



ఎస్పీడీసీఎల్ డీఈఈ సురేంద్రనాయక్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు



ట్రాన్స్‌కో అధికారులు నాటిన విద్యుత్ స్తంభాన్ని పక్కన పడేసిన దృశ్యం



కనెక్షన్‌లేక నిరుపయోగంగా మారిన బోరు, విద్యుత్ మోటారు

మదనపల్లె/టౌన్, జూన్ 7: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపంగా మారుతోంది. మదనలపల్లె మండలం సీటీఎం పంచాయతీ చెంచులక్ష్మికాలనీలో 50 కుటుంబాలు నివసిస్తుండగా వారికి విద్యుత్ సౌకర్యం కల్పించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దీంతో కాలనీవాసులు సుదూర ప్రాంతాల విద్యుత్ స్తంభాల నుంచి ఏదో విధంగా ఇంటిలో అంధకారంలేకుండా వైర్లసాయంతో విద్యుత్ సౌకర్యం కల్పించుకున్నారు. దీంతో శుక్రవారం కాలనీలోని విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి టి.కృష్ణప్ప స్థానిక ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో రూరల్ డీఈఈ సురేంద్ర నాయక్‌కు కలిసి ఆ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణప్ప మాట్లాడుతూ సీటీఎం పంచాయతీ చెంచులక్ష్మి కాలనీలో 50 గిరిజన కుటుంబాలు కాలనీలో విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో దూరంగా ఉన్న స్తంభాల నుంచి సొంత డబ్బులతో విద్యుత్ తీగలు లాగి ఇళ్లకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసుకుని విద్యుత్ వాడుకుంటున్నారన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు కింద ఈ కాలనీలో ఇంత వరకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదని, కనీసం విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో వీధిదీపాలు కూడా వేసుకోలేని దుస్థితిలో ఉన్నారన్నారు. 200 యూనిట్లలోపు విద్యుత్ వాడే గిరిజనులకు ఉచిత విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలని కోరారు. దీనిపై డీఈఈ సురేంద్రనాయక్ మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథనాయక్, సీపీఐ నాయకులు సాంబశివ, తిరుమల, సిద్దయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్ కోసం.. రైతు రెండేళ్లుగా పోరాటం

పెద్దమండ్యం మండలం బండమీదపల్లె పంచాయతీ తుసువారిపల్లెకు చెందిన రైతు వై.వెంకటరమణారెడ్డికి గ్రామ సమీపంలోని మూడెకరాల వ్యవసాయ భూమిఉంది. ఇందులో రెండెకరాలలో మామిడి, అల్లనేరెడు మరో ఎకరా భూమిలో టమెటా, వరి సాగుచేసుకుంటున్నారు. అయితే రెండేళ్ల క్రితం ఉన్నట్లుండి బోరు ఎండిపోవడంతో సమీపంలోని వ్యవసాయభూమిలో మరో బోరు తవ్వించారు. పుష్కలంగా నీరు పండింది. ఇందుకోసం కొత్తగా వ్యవసాయ కనెక్షన్‌కు ప్రభుత్వానికి డబ్బులు చెల్లించి దరఖాస్తు చేసుకోగా అనంతరం రెండేళ్ల క్రితం 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు మూడు విద్యుత్ పోల్స్, కండక్టర్(వైరు) మంజూరు చేశారు. స్థానికంగా ఉన్న ట్రాన్స్‌కో ఏఈ శంకర్‌రెడ్డి సూచనల మేరకు విద్యుత్ స్తంభాలు నాటడంతోపాటు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు దిమ్మె కూడా రైతు నిర్మించుకున్నారు. అనంతరం అదే గ్రామానికి చెందిన ఓ రైతు అభ్యంతరం చెబుతున్నాడంటూ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకుండా, విద్యుత్ లైన్ లాగకుండా నిలిపేశారు. ఈ క్రమంలో అప్పటికే నాటిన విద్యుత్ పోల్స్‌ను తొలగించి మరో మార్గంలో ఏర్పాటు చేశారు. అక్కడ కూడా ఇదే పరిస్థితి ఉందంటూ రైతును ట్రాన్స్‌కో అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సాధారణంగా ఎక్కడైనా రైతుల నుంచి అభ్యంతరం వస్తే.. వాస్తవ పరిస్థితిని అనుసరించి నిజంగా సమస్య ఉంటే మరో మార్గాన్ని పరిశీలించాలి. అలా కాకుండా ఇక్కడ మాత్రం వైసీపీ ప్రజాప్రతినిధి చెప్పారంటూ ట్రాన్స్‌కో అధికారులు పంట ఎండిపోవడానికి కారణమవుతూ తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ రైతు వెంకటరమణారెడ్డి వాపోతున్నారు. చేతికొచ్చిన మామిడి, అల్లనేరెడి పంట ఎండిపోవడంతోపాటు తనకున్న మరో ఎకరా భూమి బీడుగా మారిపోతోందని, సాగులోకి తెచ్చుకోవడానికి సహకరించాలని బాధిత రైతు మదనపల్లె సబ్‌కలెక్టర్‌తోపాటు జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోతున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో వైసీపీ నేతలు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఈక్రమంలో అవసరం లేని వారికి ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వడం, అవసరం ఉన్న వారిని ఇలా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పెద్ద ఎత్తున ఆరోపణలున్నాయి. ట్రాన్స్‌కో మండలస్థాయి అధికారి..ప్రజాప్రతినిధి మాట విని తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, తనకు న్యాయం చేసి ఎండిపోతున్న పంటను కాపాడాలని బాధిత రైతు కోరుతున్నాడు.

రూ.8.52లక్షల కర్ణాటక మద్యం, నాటుసారా ధ్వంసం



సీజ్ చేసిన కర్ణాటక మద్యం, నాటుసారా ధ్వంసం చేస్తున్న ఎస్ఈబీ పోలీసులు

మదనపల్లె టౌన్, జూన్ 7: ఎస్ఈబీ అధికారులకు పట్టుబడిన రూ.8.52 లక్షల విలువ చేసే పట్టుబడిన కర్ణాటక మద్యం, నాటుసారాను ఈఎస్ సమక్షంలో శుక్రవారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈబీ ఈఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికలు అయిపోయాయి..ఇక రెస్ట్ దొరికిందని నిర్లిప్తంగా ఉండవద్దని, సరిహద్దు చెక్‌పోస్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మదనపల్లె ఎస్ఈబీ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఆయన, కర్ణాటక సరిహద్దులోని చీకిలబైలు చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఎన్నికల సమయంలో ఎలాగైతే విధులు నిర్వహించారో, అలాగే మిగిలిన రోజుల్లో కూడా నిబద్దతతో విధులు నిర్వహించాలన్నారు.అక్రమంగా కర్ణాటక మద్యం రవాణా, నాటుసారా తయారీ, రవాణా, గంజాయి విక్రయాలపై మరింత దృష్టి పెట్టాలన్నారు. ఎస్ఈబీ కేసుల్లో పట్టుబడిన వాహనాలను త్వరగా వేలం వేసే దిశగా చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబీ సీఐ రమేశ్‌రెడ్డి, ఎస్ఐ వీజీ రాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

ములకలచెరువు, జూన్ 7: మండలంలోని వేపూరికోట పంచాయతీలో ఉన్న సంద్రడివిలో శుక్రవారం సాయంత్రం ప్రేమ జంట ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసుల సమాచారం మేరకు....ములకలచెరువు మండలం దేవళచెరువుకు చెందిన నరేంద్ర (22), 17 ఏళ్ల బాలిక ప్రేమించుకుంటున్నారు. ఈక్రమంలో ఇద్దరూ సంద్రడివిలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండడంతో అటుగా వెళ్లిన పశువుల కాపరులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ తిప్పేస్వామి సంఘటనా స్థలానికి చేరుకుని వారిని తన వాహనంలోనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. దీంతో సకాలంలో వారికి చికిత్సలు అందేలా చేసి ఎస్ఐ మానవత్వాన్ని చాటుకున్నారు. కాగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువకుడిని 108 అంబులెన్సు అందుబాటులో లేకపోవడంతో ఎస్ఐ తన వాహనంలో ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడి మానవత్వం చాటుకున్న విషయం విదితమే.

నలుగురి పై కేసు నమోదు

మదనపల్లి అర్బన్ జూన్ 7 : వీవర్స్ కాలనీలోని భూ తగాదాల విషయంలో నలుగురిపై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. స్థానిక నీరుగట్టువారిపల్లె సమీపంలోని వీవర్స్ కాలనీలో వరదారెడ్డి విద్యాసాగర్, నాగేంద్రప్రసాద్‌లకు 1ఎకరా 26సెంట్లు భూమి ఉన్నట్లు చెప్పారు. స్థానికంగా ఉన్న వసంతరెడ్డి, అంజీ, ప్రసాద్, సుబ్రహ్మణ్యంలు శుక్రవారం భూమిలో వేసిన కంచెను, సీసీ కెమెరాలను దౌర్జన్యంగా ధ్వంసం చేశారు. ఈ విషయంగా ఇరువర్గాలు దాడి చేసుకున్నారు. ఇందులో వరదారెడ్డి, విద్యాసాగర్ ఫిర్యాదు మేరకు వసంతరెడ్డి, అంజి, ప్రసాద్, సుబ్రమణ్యంలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వలసపల్లె వద్ద మహిళ మెడలో గొలుసు చోరీ

మదనపల్లె అర్బన్, జూన్7:రూరల్ మండలం, వలసపల్లె వద్ద మహిళ మెడలో గొలుసు చోరీకి గురైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు వలసపల్లె వద్ద గ్రానైట్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న లావణ్య వలసపల్లె సమీపంలో అంగడిలో పాల ప్యాకెట్ తీసుకుని ద్విచక్రవాహనంపై ఫ్యాక్టరీ వెళుతున్న సమయంలో స్కూటర్ నుంచి పాలు ప్యాకెటు రోడ్డుపై జారీ పడిపోయింది. దానిని తీసుకోవడానికి కిందకు దిగగానే వెనుక నుంచి స్కూటర్లలో వస్తున్న ఓ వ్యక్తి లావణ్య మెడలోని గొలుసు లాక్కొని పరారయ్యాడు. ఈ బంగారు గొలుసు 20 గ్రాములు, రూ. 90వేలు విలువ చేస్తోందని లావణ్య తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు తాలుకా సీఐ శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జూన్ 7: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు మదనపల్లె వన్ టౌన్ హెడ్‌కానిస్టేబుల్ మోహన తెలిపారు. పోలీసుల వివరాల మేరకు మదనపల్లెకు చెందిన బాలిక శుక్రవారం అంగడికి వెళ్లి వస్తానంటూ అదృశమైనట్లు తెలిపారు. బాలిక తమ్ముడు ఫిర్యాదు మేరకు వన్‌టౌన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగులకు నగదు ప్రోత్సాహకాలు



మదనపల్లి అర్బన్ జూన్ 7 : స్థానిక ఆర్టీసీ వన్ డిపోలో ఆదర్శ ఉద్యోగుల సభను నిర్వహించారు . శుక్రవారం నిర్వహించిన ఆదర్శ ఉద్యోగులకు డిపో మేనేజర్ మూరే వెంకటరమణ రెడ్డి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. స్థానిక డిపోలో ఏర్పాటు చేసిన సభలో అన్ని విభాగాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఉద్యోగులను ఆయన అభినందించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదర్శ ఉద్యోగులను అందరూ ఆదర్శంగా తీసుకొని సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రేవతి, ఎంఎఫ్ రవి. ఆర్టీసి ఉద్యోగులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో నైతిక విజయం మనదే : జయచంద్రారెడ్డి

● తంబళ్లపల్లె నియోజకవర్గంలో అందరికి అందుబాటులో ఉంటా
● చంద్రబాబు సహకారంతో ప్రతి సమస్యను పరిష్కరిస్తా



విజయోత్సవ సంబరాల్లో భాగంగా జయచంద్రారెడ్డికి కేక్‌ను తినిపిస్తున్న నేతలు

పెద్దతిప్పసముద్రం జూన్ 7 : తంబళ్లపల్లె నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ స్వల్ప తేడాతో ఓటమి చెందిప్పటికి నైతిక విజయం మనదేనని తంబళ్లపల్లె టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేత దాసరిపల్లె జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పీటీఎంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన విజయోత్సవ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఆయనకు కూటమి నాయకులు పూల మాలలతో సత్కరించి బారీ కేక్‌ను కట్ చేసి విజయోత్సవ సంబరాలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన తీర్పును తాను శిరషా వహిస్తానని, నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రతి సమస్యను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. చంద్రబాబు సారధ్యంలో కొత్తగా ఏర్పాటవుతున్న ప్రభుత్వ సహకారంతో తంబళ్లపల్లెలో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఆనంద్‌రెడ్డి, ములకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ సంపతికోట కిట్టన్న, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్(చిన్నా), బూర్లపల్లె సుధాకర్‌రెడ్డి, మదుకర్‌రెడ్డి, మాదవ్‌రెడ్డి, పట్టా చంద్రమోహన్‌రెడ్డి, భజంత్రి రామచంద్ర, మేస్త్రీ రెడ్డి, చింతకాయల వినోద్, రాము, బాస్కర్‌రెడ్డి, జయరాం, కుందిలి వెంకటరెడ్డి, ముద్దసాని నాగరాజు, జనసేన మండల అద్యక్షుడు శంకర, కార్యం సుబ్రమణ్యం, సప్పి రాజు, రాఘవ, నందిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు దర్గాలో చాదర్ సమర్పించిన షాజహాన్‌బాషా



నెల్లూరు దర్గాలో పూలచాదర్ సమర్పిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జూన్ 7: రాష్ట్రానికి చంద్రబాబు సీఎం కావాలని నెల్లూరు దర్గాలో మొక్కుకున్న మదనపల్లె ఉమ్మడికూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా, తాను ఎమ్మెల్యేగా గెలుపొంది, చంద్రబాబు సీఎం అవుతున్న సందర్భంగా నెల్లూరు దర్గాలో మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం నెల్లూరు వద్ద బరా షాహెద్ దర్గాలో షాజహాన్‌బాషా ప్రత్యే ప్రార్థనలు చేశారు. దర్గాపై పూల చాదర్ సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ముస్లీం మైనారిటీలకు పెద్దపీట వేసి రాష్ట్రంలో ముగ్గురు ముస్లీం మైనారిటీలను ఎమ్మెల్యేలుగా గెలిపించిన ఘనత చంద్రబాబుదే అన్నారు. అనంతరం దర్గా నిర్వాహకులు షాజహాన్‌బాషాను ఘనంగా సత్కరించారు.

చంద్రబాబు ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటారు



టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, జూన్ 7: మదనపల్లె కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటుకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట తప్పకుండా నెరవేరుస్తారని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక నిమ్మనపల్లె సర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వచ్చి మూడు రోజులు కూడా కాలేదని, అప్పుడే మదనపల్లెలో కొంత మంది అధికారం చేపట్టబోయే చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీపై నానా రభస చేస్తున్నారన్నారు. ఈనెల 12న చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తున్నారని, మదనపల్లె జిల్లా ఏర్పాటుపై ప్రత్యేకంగా దృష్టి పెడతారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



చింతపర్తి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మి

వాల్మీకిపురం, జూన్ 7: ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించి సిబ్బంది విధుల వివరాలను ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేం ద్రంలో కేసులు రెఫర్ చేయకుండా ఎక్కువ కాన్పులు జరిగేలా చూసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని చారావాండ్లపల్లెలో 104 వైద్య సేవలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా బీసీజీ వ్యాక్సిన్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 60ఏళ్లు పైబడిన అందరికీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు, పొగాకు వినియోగంతో బాధపడుతున్న వారికి ఈ వ్యాక్సిన్ వేస్తారన్నారు. ఈకార్యక్రమంలో వైద్యులు సనాఆయేషా, శ్రీవిద్య, సీహెచ్‌వో ఇందిరారాణి, సూపర్‌వైజర్ సుధాకర్, సిబ్బంది సరళ, నాగకరుణమాత, సౌజన్య, సుజాత, 104 సిబ్బంది ఆశావర్కర్లు పాల్గొన్నారు.

క్షయవ్యాధి లేని సమాజం కోసమే బీసీజీ టీకా



రెడ్డివారిపల్లెలో బీసీజీ టీకా గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

నిమ్మనపల్లి, జూన్ 7: క్షయ వ్యాధి లేని సమాజం కోసమే వయోజన బీసీజీ టీకాను వేస్తున్నట్లు ఆరోగ్యవైద్యాధికారి మహమ్మద్‌రఫి, టీబీ పర్యవేక్షకుడు నాగిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రెడ్డివారిపల్లి, ఎగువమాచిరెడ్డిగారిపల్లిల్లో ప్రజలకు బీసీజీ టీకా గురించి వివరించారు. భవిష్యత్తులో క్షయవ్యాధి రాకుం డా ముందస్తు జాగ్రత్త ఉండేందుకు ప్రభుత్వం బీసీజీ టీకాను తెచ్చిదన్నారు. అలాగే 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ టీకాను వేసుకొంటే భవిష్య త్తులో క్షయ వ్యాధి భారిన పడకుండా ఉంటారని తెలిపారు. ముఖ్యంగా 60ఏళ్లు నిండితే ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. ప్రస్తుతం మండంలోని అన్ని గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ బీసీజీ టీకాలను వేస్తున్నమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎమ్‌లు, ఆశాలు పాల్గొన్నారు.

మిగులు సీట్లు భర్తీ కోసం ప్రవేశ పరీక్ష

కలికిరి, జూన్ 7: జిల్లాలోని మహాత్మా జ్యోతీబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో మిగులు సీట్లు భర్తీ చేయడానికి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు కలికిరి బాలికల పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనరు వై. సోమశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ న ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని 6, 7, 8, 9 తరగతుల్లో ఇంగ్లీషు మీడియంలో చదవడానికి ప్రవేశాల కోసం ఈ నెల 15వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులు పంపుకోవాలని,ఇతర వివరాల కోసం ఆయా బీసీ గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని లేదంటే 90007 15637 నంబరులో కలికిరి కన్వీనరును సంప్రదించాల్సిందిగా సోమశేఖర్ కోరారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వాల్మీకిపురం, జూన్ 7: వాల్మీకిపురం పట్టణ సమీపంలోని తరిగొండ రోడ్డులో గల ఏపీ మైనార్టీ బాలికల కళాశాలలో పిజికల్ డైరెక్టర్ (పీడీ) గెస్ట్ ఫ్యాకల్టీ పోస్ట్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమామంజుల శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీఈడీ విద్యార్హత కలిగిన అభ్యర్థులు వారి దరఖాస్తులను ఈనెల 12వ తేదీ లోపు నేరుగా కళాశాలలో అందజేయాలన్నారు.

టీడీపీ నేతల సంబరాలు



గుర్రంకొండ, జూన్ 7: ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు శుక్రవారం గుర్రంకొండలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇందిరమ్మ కాలనీ నుంచి బస్టాండు మీదుగా బాణ సంచా పేల్చుతూ ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో వందలాది మంది పాల్గొన్ని నృత్యాలు చేశారు. తెలుగుదేశం పార్టీతో ప్రజలకు మంచి జరుగుతుందని తెలిపారు. ర్యాలీ సందర్భంగా పట్టణంలో ఎటువంటి గొడవలు జరుగకుండా పోలీసులు తగు జాగ్రత్తలను తీసుకున్నారు.

రేపు సీతారాముల కల్యాణం

వాల్మీకిపురం, జూన్ 7: వాల్మీకిపురం పట్టాభిరామాలయంలో ఆదివారం ఉదయం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సీతారాముల కల్యాణమహోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజులు పేర్కొన్నారు. వేడు కల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తారన్నారు.

కోర్టులో గంగమ్మకు ప్రత్యేక పూజలు



అలంకరణలో అమ్మవారు

మదనపల్లి అర్బన్ జూన్ 7 : స్థానిక కోర్టులోగంగమ్మతల్లికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొల్పి ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించి విశేష పూజలు చేశారు . రాహుకాల సమయంలో అధిక సంఖ్యలో మహిళలు ఆలయం చేరుకుని చీర జాకెట్టు , పసుపు కుంకుమలతో పొంగలి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాహుకాల సమయంలో నిమ్మకాయలపై నెయ్యి వత్తులతో దీపారాధన చేశారు . అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు . కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మార్వ్పారి చిన్నరెడ్డెప్ప , ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్‌నాయుడు , కార్యదర్శి మార్వ్పారి ప్రభాకర్‌నాయుడు , ట్రెజరర్లు రాటకొండ రంగస్వామినాయుడు , జోలెపాళెం కరునాకర్‌నాయుడు , మార్వ్పారి మహేష్ , మార్వ్పారి విక్కి , జోలెపాళెం దేవేంద్ర, బోయపాటి శ్రీనివాసులు నాయుడు, ఉపాండ్ల కృష్ణకుమారి పర్యదేక్షించారు .

సర్వజన బోధనాస్పత్రిలో ఎస్వీ వైద్యబృందం పరిశీలన



సర్వజన బోధనాస్పత్రిలో పర్యటించి, సూచనలిస్తున్న ఎస్వీ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్లు

మదనపల్లె టౌన్, జూన్ 7:మదనపల్లె మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న సర్వజన బోధనాస్పత్రి(జీటీహెచ్)లో ఎస్వీ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్లు పర్యటించారు. శుక్రవారం ఎస్వీ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్లు డాక్టర్ కిరీటి, డాక్టర్ రమాదేవిలు జీటీహెచ్‌లో పలు చోట్ల పరిశీలించి ఆస్పత్రి వైద్యులకు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా మెడికల్‌సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు మాట్లాడుతూ త్వరలో మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిని, ఆరోగ్యవరం వద్ద మదనపల్లె మెడికల్ కాలేజీని నేషనల్ మెడికల్ కౌన్సిల్ బృందం సభ్యులు పరిశీలించనున్నారన్నారు. దీనికి ముందుగానే బోధనాస్పత్రిలో ఏయే సదుపాయాలు, వైద్య పరీక్ష పరికరాలు, చికిత్సలు ఉండాలో ఎస్వీ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ల సలహాలు తీసుకుంటున్నామన్నారు. వచ్చే నెలలో ఎన్ఎంసీ సభ్యులు మదనపల్లెకు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, డిప్యూటీ సూపరింటెండెంట్‌లు డాక్టర్ బాబు, మురళీధర్‌లు పాల్గొన్నారు.

రీలర్లకు రీలింగ్ యూనిట్ స్థలాలు కేటాయించండి



సిరికల్చర్ ఏడీ సరోజకు వినతి పత్రం ఇస్తున్న బీవైఎస్ పునీత్, రీలింగ్ యూనిట్ల నిర్వాహకులు

మదనపల్లె టౌన్, జూన్ 7: మదనపల్లె పట్టణం సిరికల్చర్ కాలనీలో అర్హులైన రీలర్లకు రీలింగ్‌యూనిట్ ఏర్పాటుకు స్థలాలు కేటాయించాలని బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ ప్రభుత్వాన్ని కోరారు. ఆమేరకు రీలర్లు చంద్ర, ప్రవీణ్‌లతో కలిసి సిరికల్చర్ ఏడీ సరోజకు ఆయన వినతి పత్రం అందజేశారు. అంతకు ముందు శుక్రవారం స్థానిక సిరికల్చర్ కార్యాలయం వద్ద వారు నిరసన తెలియజేశారు. అనంతరం ఏడీతో వారు మాట్లాడుతూ సిరికల్చర్ కాలనీలో 16.5 కుంటల స్థలంలో ఇటీవల 11 యూనిట్లు ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. ఈ స్థలాలను అర్హులకు కాకుండా అనర్హులకు మంజూరు చేశారని, కాని ఇదే పరిశ్రమపై ఆధారపడి, అద్దె భవనాల్లో రీలింగ్ యూనిట్లు నడుపుతున్న తమకు రీలింగ్ యూనిట్ స్థలాలు కేటాయించలేదన్నారు. అనర్హులకు రీలింగ్ యూనిట్ ఏర్పా టుకు స్థలాలు కేటాయించడమే కాక, వాటిని రిజిస్ట్రేషన్ కూడా చేయిస్తున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం క్షేత్రస్థాయిలో విచారించి అనర్హులకు కేటాయించిన స్థలాలను రద్దు చేసి, అర్హులకు కేటాయించాలని వారు కోరారు.

విద్యార్థులు పుస్తక పఠనం అలవరచు కోవాలి



గుర్రంకొండ గ్రంథాలయంలో విద్యార్థులతో గ్రంథాలయాధికారిణి

గుర్రంకొండ, జూన్ 7:విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవడంతో విద్యలో రాణించవచ్చునన్ని ఎంఈవో-2 సుబ్రమణ్యం పేర్కొన్నారు. శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే విద్యపట్ల శ్రద్ధ వహించాలన్నారు. అలాగే గ్రంథాలయాలకు వచ్చి వివిధ రకాల పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి రెడ్డికుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువు పట్ల విద్యార్థుల ఆసక్తి ప్రశంసనీయం



విద్యార్థులతో గ్రంథాలయాధికారి

కలకడ, జూన్ 7:వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవడంలో విద్యార్థులు కనబరిచిన ఆసక్తి ప్రశంసనీయమని గ్రంథాలయ అధికారి అమరనాథ్ పేర్కొన్నారు. గత నెల 15వ తేదీన ప్రారంభమైన వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసిందన్నారు. ఇందులో భాగంగా వివిధ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులను ఆయన ప్రదానం చేశారు.

రథంపై దర్శనమిచ్చిన శ్రీనివాసుడు



రథంలో ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణుడు



ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు

బి.కొత్తకోట, జూన్7: మండల పరిధిలోని గట్టు గ్రామంలో వెలసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం బ్రహ్మరథోత్సవం(తేరు) కనుల పండువగా వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే వేదపండితులు ప్రత్యేక పూజలు, కైంకర్యాల తోపాటు హోమం నిర్వహించారు. అనంతరం రంగురంగుల పుష్పాలతో సుందరంగా అలంకరించిన రథంపై అలివేలుమంగ తాయారు, పద్మావతీ అమ్మవార్లతో పాటు శోభాయమానంగా తీర్చదిద్దిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను మేళతాళాలు, మంత్రోచ్ఛారణల మధ్య ఆసీనులను చేశారు. వేడుకకు హాజరైన భక్తులు భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగి పరవశించారు. గట్టు గ్రామ వీధులు గోవింద నామస్మరణలతో మారుమ్రోగాయి. భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. రథోత్సవంలో నియోజకవర్గ నేతలు చల్లపల్లి నరసింహారెడ్డి, దాసరిపల్లి జయచంద్రారెడ్డిలు పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు అల్లూరి సుబ్రమణ్యం, సుధాకర్‌బాబు ల ఆధ్వర్యంలో జరిగిన ఈ బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి కల్యాణోత్సవం కనువిందుగా నిర్వహించారు. చుట్టుప్రక్కల గ్రామాల నుంచి మహిళలు పెద్దసంఖ్యలో హాజరై కల్యాణవేడుకను తిలకించారు. కార్యక్రమంలో స్థానికులు రాజన్న, రెడెప్ప, బయ్యారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సిద్దారెడ్డి, ప్రభాకర్, రఘురామ తదితరులు పాల్గొన్నారు.